ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 13 జూలై 2025



■ గజరాజుల కట్టడికి యాక్షన్ ప్లాన్

దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఏనుగుల దాడులను కట్టడి చేసేందుకు కార్యాచరణ సిద్ధమవుతోంది. ఇందుకోసం ఏర్పాటు చేసిన ఒక కమిటీ తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో ఏనుగుల సంతతి, వాటి కదలికలు, ప్రజల ఆస్తులు, ప్రాణాలకు నష్టం కలగకుండా ఎలా కట్టడి చేయాలి అనే దానిపై యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. పూర్తిస్థాయిలో పరిశీలించి, నివేదికను నోడల్ కమిటీకి అందజేసింది.

8

■ ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. నగరంలోని 10 ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పూర్ణకుంభం సర్కిల్ నుంచి భారతి బస్టాండు వద్దకు నడుచుకుంటూ వెళ్లారు. అక్కడ ప్రైవేటు వాహనాల వారికి కొన్ని సూచనలు చేశారు. తిమ్మినాయుడుపాళెం వాసులతో ముచ్చటిస్తూ అక్కడి సమస్యలను నోరుగా తెలుసుకున్నారు.



శ్రీకాళహస్తిలో కలకలం

● హత్యకు కారణాలపై పలు అనుమానాలు

● పార్టీ నుంచి బహిష్కరించిన జనసేన అధిష్ఠానం

మాజీ పీఏ హత్య కేసులో జనసేన ఇన్‌ఛార్జి వినుత దంపతులు సహా ఐదుగురి అరెస్టు



శ్రీనివాసులు (ఫైల్ ఫొటో)



శ్రీనివాస్ మృతదేహంపై వాతలు

శ్రీకాళహస్తి/తిరుపతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి):మాజీ పీఏ హత్య కేసులో శ్రీకాళహస్తి జనసేన ఇంఛార్జి వినుత దంపతులను చెన్నై పోలీసులు అరెస్టు చేయడం రాజకీయవర్గాల్లో కలకలం రేపింది.అసలేం జరిగిందో తెలియక పార్టీ వర్గాలతో పాటు ప్రజానీకం కూడా అయోమయానికి లోనైంది.రేణిగుంట పట్టణానికి చెందిన వినుతను 2019లో జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రకటించారు. బంగారుపాళ్యానికి చెందిన కోట చంద్రబాబుతో అదే సంవత్సరంలో ఆమెకు వివాహం జరిగింది. ఆ సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసి ఓడిపోయారు. శ్రీకాళహస్తి పట్టణంలో వినుత దంపతులు అద్దె ఇంట్లో నివాసం, పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు సాగించేవారు.

హత్యకు దారితీసిన కారణాలేంటి?

గత ఎన్నికలకు ముందు నుంచీ కూడా వినుతకు జనసేనలోనే ఇతర నేతలతో సత్సంబంధాలు, సామరస్యం లేదని సమాచారం. కూటమిలోని మరో ప్రధాన పార్టీ ముఖ్యనేతతో సైతం సత్సంబంధాలు లేవని, కొంతమేరకు విభేదాలు కూడా వున్నాయనే ప్రచారం జరిగింది. ఎన్నికల తర్వాత ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో ప్రాధాన్యత బాగా తగ్గిపోయింది. ఆ క్రమంలో నియోజకవర్గ ముఖ్యనేతపై వినుత మంత్రులకు ఫిర్యాదులు చేశారన్న ప్రచారం జరిగింది. వీటన్నింటి నేపథ్యంలో వినుత సన్నిహిత అనుచరులు క్రమేపీ ఆమెకు దూరమైనట్టు సమాచారం. దాని వెనుక తన రాజకీయ ప్రత్యర్థులున్నారని,వారి ప్రలోభాలతోనే తన అనుచరులు దూరమవుతున్నారని వినుత సన్నిహిత వర్గాలు అసంతృప్తితో వున్నట్టు తెలిసింది. అదే సమయంలో పీఏ శ్రీనివాసులు ఆమెకు సంబంధించిన కొన్ని వీడియోలు, ఇతర సమాచారం రాజకీయ ప్రత్యర్థులకు అందజేస్తున్నాడనే అనుమానాలు రావడంతోనే అతడిని కొట్టి వేధించారని సమాచారం.

ఎవరీ శ్రీనివాసులు?

ఆరేళ్ళుగా వినుత వద్ద డ్రైవరుగా, వ్యక్తిగత సహాయకుడిగా శ్రీకాళహస్తి మండలం బొక్కిసపాలెం గ్రామానికి చెందిన రాజేశ్వరమ్మ మనవడు శ్రీనివాసులు అలియాస్ రాయుడు పని చేసేవాడు.వారితో అత్యంత సన్నిహితంగా మెలిగేవాడు.ఈ క్రమంలో గత నెల 22వ తేదీన శ్రీనివాసులును పనిలో నుంచి తొలగిస్తున్నట్టు వినుత దంపతులు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. తమ రాజకీయ ప్రత్యర్థుల ప్రలోభాలకు లొంగిన శ్రీనివాసులు ప్రాణ, గౌరవ అంశాలలో భంగం కలిగిస్తున్నాడన్న కారణంతో తొలగిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు.వినుతకు సంబంధించిన కొన్ని వీడియోలు, ఇతర సమాచారం రాజకీయ ప్రత్యర్థులకు శ్రీనివాసులు అందజేస్తున్నాడనే అనుమానాలు రావడంతోనే అతడిని పీఏగా తొలగించినట్టు ప్రచారం జరుగుతోంది.అనంతరం వినుత, ఆమె కుటుంబీకులు, అనుచరులు పలుమార్లు శ్రీనివాసులును నిర్బంధించి చిత్రహింసలకు గురి చేసినట్టు ఆరోపణలున్నాయి. తమ సమాచారం ఎవరు అడిగారు? ఏ సమాచారం అందజేశావు? వంటి వివరాలు రాబట్టేందుకు హింసించారని, తాము హింసించిన దృశ్యాలను వీడియో తీయడంతో ఆ సందర్భంగా శ్రీనివాసులు చెప్పిన విషయాలను కూడా వీడియో రికార్డింగ్ చేశారని సమాచారం. గత నెలలో ఒకసారి, మళ్ళీ ఈనెల ప్రారంభంలో ఒకసారి రేణిగుంట గోదాములో నిర్బంధించి చిత్రహింసలు పెట్టినట్టు ఆరోపణలున్నాయి.

రేణిగుంటలో హతమార్చి...చెన్నైలో పడవేసి...



ఈనెల 7వ తేదీన శ్రీనివాసులును రేణిగుంట గోదాముకు తీసుకెళ్ళి తీవ్రంగా కొట్టారని, ఆ సందర్భంగా కూడా వీడియోలు తీశారని, అతడు చెప్పిన సంగతులు కూడా రికార్డు చేశారని సమాచారం. బాత్‌రూమ్‌కు వెళ్ళిన శ్రీనివాసులు అందులోనే చనిపోయాడని, దాంతో వారు శ్రీనివాసులు మృతదేహాన్ని తీసుకుని రెండు కార్లలో తమిళనాడు వైపు వెళ్ళినట్టు సమాచారం. తిరువళ్ళూరు చేరుకున్నాక ఏపీ రిజిస్ట్రేషన్‌తో వున్న కారు నుంచీ మృతదేహాన్ని తమిళనాడు రిజిస్ట్రేషన్ కలిగిన కారులోకి మార్చి చెన్నై వెళ్ళినట్టు తెలిసింది. చెన్నై చేరుకున్నాక అదే రోజు రాత్రి సెవెన్ వెల్స్ ప్రాంతంలోని ఎంఎస్ నగర్ హౌసింగ్ కాలనీ వెనుక కువ్వా నది కాలువలో పడవేసినట్టు చెన్నై పోలీసుల దర్యాప్తులో తేలింది.

చెన్నై పోలీసుల దర్యాప్తులో హత్యగా నిర్ధారణ

ఈనెల 8వ తేదీన కువ్వా నది కాలువలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించడంతో మింట్ పోలీస్ స్టేషన్ పోలీసుల దృష్టికి వెళ్ళింది. వారు శవాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.పోస్టుమార్టం నివేదిక ఆ యువకుడిది హత్యేనని తేల్చి చెప్పింది.శరీరంలోపలి భాగంలో పలుచోట్ల గాయాలైనట్లు స్పష్టం చేసింది.దీంతో పోలీసులు మృతదేహం లభించిన కాలువలో మళ్లీ పడవల సాయంతో గాలించారు. ఆ సమయంలో పోలీసులకు ఓ సంచీ, మొబైల్ ఫోన్ లభ్యమయ్యాయి. ఆ సంచీలో దొరికిన ఆధారాలను బట్టి తిరుపతికి చెందిన శ్రీనివాసులుగా గుర్తించిన పోలీసులు.. మొబైల్ ఫోన్ కాల్‌డేటాను పరిశీలించారు. మృతుడి కుడి చేతిపై జనసేన పార్టీ చిహ్నం, వినుతక్క అనే టాటూ వుండడంతో చెన్నై పోలీసులకు క్లూ దొరికింది.ఆపై రంగంలోకి దిగి మృతదేహాన్ని కాలువలో పడేసిన దగ్గర నుంచీ సీసీ కెమెరాల ఫుటేజీలను రివర్సులో పరిశీలిస్తూ వెళ్ళగా తిరువల్లూరులో ఏపీ రిజిస్ట్రేషన్ వాహనాన్ని గుర్తించారు. అక్కడి నుంచీ రేణిగుంట గోదాము దాకా చేరుకున్నారు. గోదాములో సీసీ కెమెరాల ఫుటేజీలు కూడా చెన్నై పోలీసులు సేకరించినట్టు సమాచారం. ఆ ఆధారాలతో నిందితులను గుర్తించినట్టు తెలిసింది.

3 నెలలుగా టార్చర్: శ్రీనివాసులు అమ్మమ్మ

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి):తన మనవడు శ్రీనివాసులును వినుత దంపతులు 3 నెలలుగా టార్చర్ పెట్టారని అతడి అమ్మమ్మ రాజేశ్వరి తెలిపారు. చెన్నై సెవెన్‌వెల్స్ పోలీసు స్టేషన్ వద్ద 'ఆంధ్రజ్యోతి'తో రాజేశ్వరి మాట్లాడుతూ.. "నెల రోజుల క్రితం కిందపడి 3 కుట్లు పడ్డాయని తెలిసి చూడ్డానికి వెళ్లా. అతనేమీ మాట్లాడలేదు. కానీ చంద్రబాబు మాత్రం 'మీ మనవడు మా సమాచారం వేరే పార్టీ వారికి ఇవ్వబోయి దొరికిపోయాడు. మా నుంచి తప్పించుకుని పారిపోతూ బిల్డింగ్ పైనుంచి కిందపడ్డాడు' అని చెప్పాడు. అడిగితే మా మనవడు ఏడుస్తూ వుండిపోయాడు. ఒక లాయర్‌ను తీసుకొచ్చి వీడియో తీస్తూ తెల్లకాగితంపై సంతకాలు తీసుకున్నారు. అందులో వారికిష్టమొచ్చింది రాసుకున్నారు. ఆ రోజు నేను కూడా వినుత మొగుడి కాళ్లు పట్టుకున్నా.. మావాణ్ని ఏమీ చేయవద్దని. అయినా మూడు నెలల నుంచీ ఓ గోడౌన్‌లో టార్చర్ చేస్తున్నారు. వారి వద్ద ఆరేళ్లుగా పని చేస్తున్న శ్రీనివాసులు పది రోజుల క్రితం పని మానేశాడు. కానీ మళ్లీ పిలుస్తున్నారని, నాలుగు రూపాయలు సంపాదించుకుని వస్తానని వెళ్లాడు. తనకు తెలిసిన విషయాలు బయటకు చెబితే వాళ్లు చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని అన్నాడు. 'జాగ్రత్త అమ్మమ్మా' అన్నాడు. ఇంతలోకే అతన్ని చంపేశారు. నిన్న సాయంత్రం 4 గంటలకు పోలీసులు వచ్చి చెబితే గానీ అతను చనిపోయిన విషయం మాకు తెలియలేదు."

వినుత సహా ఐదుగురి అరెస్టు



నిందితులు కోట వినుత, కోట చంద్రబాబు, గోపి, షేక్ తస్సాన్, శివకుమార్

శ్రీనివాసులు హత్య కేసులో జనసేన ఇంఛార్జి వినుత, ఆమె భర్త కోట చంద్రశేఖర్ (చంద్రబాబు),వారి వద్ద డ్రైవర్లుగా పనిచేసే రేణిగుంటకు చెందిన తస్సం(28), తొట్టంబేడు మండలం సింగమాలకు చెందిన గోపి(24), వారి ప్రధాన అనుచరుడుగా ఉన్న బొక్కిసంపాళెంకు చెందిన శివకుమార్(34)ను తమిళనాడు పోలీసులు అదుపులోకి తీసుకుని చెన్నైకు తరలించారు.వారి నుంచీ ల్యాప్‌టాప్ సహా శ్రీనివాసులును హింసించిన వీడియోలు, అతడు చెబుతుండగా రికార్డు చేసిన వీడియోలు కూడా స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.శనివారం రాత్రి నిందితులను చెన్నైలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

జనసేన నుంచి బహిష్కరణ

జనసేన పార్టీ నుంచి వినుతను బహిష్కరిస్తున్నట్లు శనివారం ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న వినుత వ్యవహార శైలి పార్టీ విధానాలకు విరుద్ధంగా వుండడంతో కొంతకాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఆమెపై చెన్నైలో హత్య కేసు నమోదు కావడం పార్టీ దృష్టికి రావడంతో వినుతను బహిష్కరిస్తున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు.

తిరుపతికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

● సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్ కేటగిరీలో ఎంపిక


● ఈనెల 17న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

తిరుపతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్ఠాత్మకంగా అందించే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు తిరుపతి నగరపాలక సంస్థ ఎంపికైంది. 3 లక్షల జనాభా కేటగిరీలో తిరుపతి నగర కార్పొరేషన్ సూపర్ స్వచ్ఛ లీగ్‌ను కైవశం చేసుకుంది. ఈ నెల 17న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. పరిశుభ్రమైన పరిసరాల ద్వారా ఆరోగ్యకర సమాజం సాధించే లక్ష్యంతో ప్రధాని మోదీ రూపొందించిన స్వచ్ఛ భారత్ విప్లవం కొనసాగుతోంది. ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో అవార్డులను ప్రకటిస్తూ మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను ప్రోత్సహిస్తోంది. తిరుపతి నగరపాలక సంస్థ అవార్డుకు ఎంపిక కావడం పట్ల కమిషనర్ ఎన్.మౌర్యతో పాటు పలువురు నగర ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలోని అధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది, నగర ప్రజల సహకారంతోనే ఈ అవార్డు సాధించగలిగామని అన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించగలుగుతామని ధీమా వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్ గేమ్‌లతో అప్పుల పాలై
యువకుడి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి అప్పులపాలై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దకాపులేఅవుట్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ గిరిబాబు వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలానికి చెందిన మురళి(33) కొన్ని రోజులుగా తిరుపతి పెద్దకాపు లేఅవుట్‌లో కాపురముంటూ మసాలా ప్యాకెట్లు మార్కెటింగ్ చేస్తున్నాడు. ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడ్డాడు. స్నేహితుల నుంచి రూ.పది లక్షల వరకు అప్పు చేశాడు.వడ్డీ పెరిగిపోవడంతో అప్పు తీర్చలేకపోయాడు. రుణదాతల నుంచి ఒత్తిడి పెరిగింది.ఈ విషయమై గొడవలు జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన మురళి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

కాలిఫోర్నియా బిజినెస్ స్కూల్లో
పుత్తూరు విద్యార్థికి ప్రవేశం



అఖిల్ నీలం



ఢిల్లీ అశోక యూనివర్సిటీ నుంచి తల్లిదండ్రులతో కలిసి మాస్టర్స్ డిగ్రీ అందుకున్న అఖిల్

పుత్తూరు, జూలై12(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన అఖిల్ నీలం ప్రఖ్యాత విద్యాసంస్థ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ ప్రవేశంతో పాటు ప్రతిభకు గుర్తింపుగా రూ.80 లక్షల స్కాలర్‌షిప్ పొందారు. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ బిజినెస్ స్కూల్‌లోనూ సీటు వచ్చినా కాలిఫోర్నియా స్కూల్‌నే ఎంపిక చేసుకున్నారు. ఢిల్లీ అశోక యూనివర్సిటీ, ఐస్‌ల్యాండ్‌లలో మాస్టర్స్ డిగ్రీలు చేశారు. తాను స్థాపించిన సెంటర్ ఫర్ జెండర్ అండ్ పాలిటిక్స్(సీజీపీ) అనే సంస్థ రాజకీయాల్లో మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడం, సాధికారతను సాధించడం వంటి అంశాల మీద పనిచేస్తుందని అఖిల్ తెలిపారు. ఈ విషయమై ఓ పుస్తకాన్ని రచించి ఐస్‌ల్యాండ్ అధ్యక్షురాలు హల్లా టోమాస్‌డోట్టిర్‌కు సమర్పించానని వివరించారు. ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలలో విద్యాశాఖకు సంబంధించి పాలసీ కన్సల్టెంట్‌గా ప్రత్యేకించి గత టీడీపీ ప్రభుత్వంలో ఆనంద వేదిక కార్యక్రమాన్ని రూపొందించినట్టు వెల్లడించారు. తనకు ఇంతటి గుర్తింపు రావడం వెనుక తల్లిదండ్రులు విశ్రాంత ఉపాధ్యాయుడు నీలం ప్రభాకర్, అంజలి శ్రమ ఎంతో ఉందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● మరో యువకుడి పరిస్థితి విషమం



మనోజ్ కృష్ణ (పాత చిత్రం)

శ్రీకాళహస్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని పూతలపట్టు-నాయుడుపేట రహదారి అండర్‌పాస్ వంతెనపై ముచ్చువోలు క్రాస్ రోడ్డు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కొండూరు గ్రామానికి చెందిన మనోజ్‌కృష్ణ, అశోక్(20), అభి(21), పవన్(24), అజయ్(24) కారులో శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు బయలుదేరారు. శ్రీకాళహస్తి శివారులోని ముచ్చువోలు క్రాస్ రోడ్డు వద్ద ముందు వెళుతున్న లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో మనోజ్‌కృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన వారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అశోక్ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



తీవ్రంగా గాయపడిన అశోక్

జగన్ రెడ్డికి తీర్థయాత్రలే గతి

● మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ధ్వజం

గంగాధరనెల్లూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'జగన్ రెడ్డీ నువ్వేమో దండయాత్రలు చేస్తావు..నీ చెంచాగాళ్లతో పాత్రికేయ మిత్రులపై దాడులు చేయిస్తావు.. ఇకనైనా రైతుల విషయంలో రాద్ధాంతం ఆపకపోతే ఆఖరికి తీర్థయాత్రలకే పోతావు' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మండిపడ్డారు.విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు,ప్రభుత్వ విప్ వీఎం థామస్‌లతో కలసి శనివారం గంగాధరనెల్లూరు మండలంలో ఆయన పర్యటించారు.గంగాధరనెల్లూరులోని ఎంపీడీవో కార్యాలయం పక్కన రూ.61లక్షలతో నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవనానికి భూమి పూజ చేశారు. నెల్లేపల్లెమిట్టలో రూ.25లక్షలు,చిన్నమిట్టపల్లెలో రూ.15లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. నెల్లేపల్లె దళితవాడలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్ళి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.అనంతరం మీడియా సమావేశంలో రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మూడురోజుల క్రితం మాజీ సీఎం జగన్‌రెడ్డి బంగారుపాళ్యం పర్యటనకు వచ్చి మామిడిపంటను రోడ్డుపాలు చేసి ట్రాక్టర్లతో తొక్కించి నాశనం చేశారంటూ ధ్వజమెత్తారు.

సూళ్లూరుపేటలో భారీగా గంజాయి పట్టివేత

● ఒడిశా నుంచి సూళ్లూరుపేట మీదుగా చెన్నైకి రవాణా

● రూ.20 లక్షల విలువ చేసే గంజాయి ప్యాకెట్లు, కారు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు

సూళ్లూరుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి చెన్నైకి తీసుకెళ్తున్న రూ.20 లక్షల విలువ చేసే 70.560 కిలోల గంజాయిని సూళ్లూరుపేట పోలీసులు శనివారం పట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సూళ్లూరుపేట పోలీసుస్టేషన్‌లో శనివారం ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మానాయుడు, తడ ఎస్ఐ కొండపనాయుడు సూళ్లూరుపేట హోలీక్రాస్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. నెల్లూరు వైపు నుంచి చెన్నై వెళ్తున్న ఏపీ 09 సీటీ 2966 నంబరు కారును తనిఖీ చేశారు. వెనుక సీటు, డిక్కీలో నాలుగు బ్యాగ్‌లలో 70.560 కిలోల గంజాయి ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న తమిళనాడుకు చెందిన టీ.బిబిన్‌నాథ్, జే.రోహన్‌ను అదుపులోకి తీసుకుని కారుతో సహా పోలీసుస్టేషన్‌కు తరలించారు. విచారించగా ఒడిశాలో తక్కువ ధరకు కొనుగోలు చేసి చెన్నైలో అధిక ధరలకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి, వారి వద్దనున్న రెండు సెల్‌ఫోన్లు, రూ.20 లక్షల విలువ చేసే గంజాయి, కారును సీజ్ చేశారు. నిందితులు తమిళనాడులో గంజాయి రవాణా, హత్య కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.

పద్మావతి అమ్మవారి సేవలో ప్రముఖులు



అమ్మవారి ఆలయం వద్ద మంత్రి కొల్లు రవీంద్ర - సినీనటుడు సంతోష్ శోభన్

తిరుచానూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారిని శనివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి సన్నిధిలోని మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే సినీనటుడు సంతోష్ శోభన్ కూడా అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయం వెలుపల అతడితో ఫొటోలు దిగడానికి భక్తులు ఆసక్తి చూపారు. ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, టెంపుల్ వాహనాల అసిస్టెంట్ సుభాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

ఆనందగిరి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

● ఎమ్మెల్యే పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

పాకాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆగస్టు నెల 13 నుండి 17వ తేది వరకు ఐదు రోజులు నిర్వహించనున్న 77వ ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ కల్యాణ మండపంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ, ప్రజా ప్రతినిధులు, ఉభయదారులు, దాతలతో ఎమ్మెల్యే శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి పార్టీలకతీతంగా అందరూ సహకరించాలన్నారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కోరారు. భక్తులకు తాగునీరు, ఉచిత భోజనం ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి, మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజ నాయుడు, డీఎల్‌పీవో సురేష్ నాయుడు, ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తిశర్మ, డీఈ మురళీధర్, తహశీల్దార్ సంతోష్‌సాయి, ఎంపీడీవో శశిరేఖ, సీఐ సుదర్శన ప్రసాద్, సర్పంచ్ గౌరీశంకరరాజు, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, సింగిల్ విండో చైర్‌పర్సన్ సావిత్రి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

చెత్తసేకరణ కేంద్రాలను పరిశీలించిన కేంద్ర బృందం



ఇంటింటా వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృంద సభ్యుడు

భాకరాపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం సభ్యుడు దామోదరన్ రెండో రోజు చెత్త సేకరణ కేంద్రాలను పరిశీలించి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ప్రతి ఇంటికీ వెళ్లి టాయిలెట్స్ ఎప్పుడు కట్టుకున్నారు, ఎంత బిల్లు వచ్చింది, సెప్టిక్ ట్యాంకులు ఉన్నాయా లేవి అని పరిశీలించారు. తడి-పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను చెత్త సేకరణ కేంద్రాలకు తరలించడం లేదని, బృందావనాలకు వెళ్లి పరిశీలించారు. ఈ సర్వే ఆధారంగానే గ్రామ పంచాయతీలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖరరెడ్డి, కార్యదర్శి రామ్మోహన్, స్వచ్ఛభారత్ కో-ఆర్డినేటర్ గిరిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ మణి, తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: టీడీపీ



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మురళీ

భాకరాపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): సుపరిపాలన, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం ఎగవూరు, దిగవూరు పంచాయతీలలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అథోగతి పాలు చేసి అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. పింఛన్ల పెంపు, తల్లికి వందనం, ఉచితంగా గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేశ్, మునస్వామి నాయుడు, రెడ్డప్పరెడ్డి, రమణారెడ్డి, వెంకటనాగులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మూకల చీకటి రాజ్యం

● పాదచారులు, వాహనదారులే టార్గెట్‌గా చోరీలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 12(ఆంధ్రజ్యోతి): నగరంలో గంజాయి బ్యాచ్‌లు హల్‌చల్ చేస్తున్నాయి. చీకటి పడిన తర్వాత కొంతమంది యువకులు ఒకే చోట చేరి మత్తు పదార్థాలు తీసుకుంటూ మైకంలో రోడ్డుపైన వెళ్లే వాహనదారులు, పాదచారులపై దాడులకు తెగబడుతున్నారు. స్థానిక డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులో ఆటోస్టాండ్‌లు, లాడ్జీలు, మద్యం దుకాణాలు, ఖాళీ ప్రాంతాలు ఎక్కువగా ఉండడంతో దీన్ని అడ్డాగా చేసుకుంటున్నారు. రాత్రి 10 గంటల తర్వాత యువకులు కొందరు బ్యాచ్‌లుగా చేరి గంజాయి, డ్రగ్స్ పదార్థాలు సేవించి రోడ్లపై విచ్చలవిడిగా హల్‌చల్ చేస్తున్నారు. మరి కొందరు లాడ్జీల్లో రూములు అద్దెకు తీసుకుని అక్కడే గంజాయి, మద్యం తాగి అర్ధరాత్రి దాటాక రోడ్లపైకి వచ్చి దాడులకు దిగుతున్న ఘటనలు లేకపోలేదు. ఇలాంటి వ్యవహారంలో కొందరు బ్లూ కోల్ట్స్, రక్షక్ పోలీసులకు సమాచారం వున్నా వారు మామూళ్ల మత్తులో తూగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 10 రోజుల క్రితం ఒక ఆటో డ్రైవర్ మరో ఇద్దరు రాజంపేట వాసులు కలసి స్థానిక డీబీఆర్ రోడ్డులోని ప్రముఖ కల్యాణ మండపం వెనుక వున్న పచ్చిక బయళ్ల వద్ద కూర్చుని మద్యం తాగుతూ రోడ్డుపై నడచి వెళుతున్న రోగుల సహాయకుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిసింది. దీనిపై బాధితులు భయపడి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

పాకాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి 1 గంట వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేఎస్ తులసీరామన్, కార్యదర్శి ఎస్ దామోదర నాయుడు తెలిపారు. పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ సహకారంతో మాధురీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాధురీ రెమిడీ హాస్పిటల్ వైద్య బృందం వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు. వాసన్ ఐ కేర్ ఆస్పత్రి వైద్య బృందంచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్ ఉచితంగా చేస్తారన్నారు.

అలరించిన భీష్మ విజయం

రామచంద్రాపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): రామాపురం మహాభారత ఉత్సవాల్లో భాగంగా భాగవతారిణి అనసూయ శనివారం వినిపించిన భీష్మ విజయం సభికులను అలరించింది. ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు.

చంద్రగిరి నియోజకవర్గంలోని ఆలయాలను అభివృద్ధి చేయండి

టీటీడీ చైర్మన్‌ను కోరిన ఎమ్మెల్యే నాని



తిరుమల, జూలై 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలోని ఉన్న ఆలయాలను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడిని కోరారు. డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడితో కలిసి ఎమ్మెల్యే శనివారం మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా తమ నియోజకవర్గంలో అతిపురాతనమైన ఆలయాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. తిరుచానూరు, అప్పలాయగుంట బిడ్జి కూలిపోయిన విషయాన్ని గుర్తుచేస్తూ దాని నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే తిరుచానూరు నుంచి అప్పలాయగుంటకు వెళ్లే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. తలకోన ఆలయ అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే నిర్ణయం తీసుకున్న రూ.4 కోట్ల నిధుల జారీ ఒకేసారి ఇవ్వాలని కోరారు. చంద్రగిరి పట్టణంలో, పాకాలలో టీటీడీ కల్యాణ మండపాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. శ్రీవారిమెట్టు మార్గం ద్వారా వచ్చే భక్తులకు మండలంలో ప్రత్యేక వసతి సముదాయాలు నిర్మించాలని కోరారు. శ్రీనివాసమంగాపురంలో నిర్మించినట్టుగానే చంద్రగిరి బస్టాండ్ వద్ద కూడా ముఖద్వారాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రగిరి - మిట్టపాళ్యం మార్గమధ్యంలో ప్రభుత్వం మిగులు భూమి ఉందని, అందులోనూ యాత్రికుల వసతి సముదాయ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. తిరుచానూరు, మంగాపురం ఆలయాల్లో కనీసం ప్రొటోకాల్ పాటించడం లేదని, దీనిపై అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

తీసుకున్న రూ.35లక్షలు అడిగితే కేసు పెడతానని బెదిరింపులు

● భార్యాభర్తలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన 15మంది వృద్ధులు



ఆర్‌సీపురం ఎస్‌ఐకి ఫిర్యాదు ఇస్తున్న వృద్ధులు

రామచంద్రాపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): వారంతా 65 ఏళ్లు నిండిన వృద్ధులు. జీవిత చరమాంకంలో బిడ్డలకు భారం కాకూడదని వచ్చిన పింఛనుతో పాటు కష్టార్జితాన్ని దాచుకున్నారు. వీరు దాచుకున్న డబ్బుపై భార్యాభర్తలు కన్నేశారు. బిడ్డలకు తెలియకుండా వడ్డీ ఆశ చూపి 15మంది వృద్ధుల నుంచి రూ.35లక్షలు తీసుకున్నారు. డబ్బు తిరిగి ఇవ్వమన్నందుకు మాపైనే కేసులు పెడతామని భార్యాభర్తలు బెదిరిస్తున్నారని బాధితులు శనివారం ఆర్‌సీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు పెద్దబ్బ, దామోదరశెట్టి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కె.వెంకటముని ఆటో డ్రైవర్. అతడి భార్య కె.లక్ష్మి తిరుపతిలో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. వీరిద్దరూ కలిసి వడ్డీ ఆశ చూపి గ్రామంలోని 15మంది వృద్ధుల నుంచి వారి కుటుంబసభ్యులకు తెలియకుండా రూ.35లక్షలు తీసుకుని ప్రామిసరీ నోట్లు రాసిచ్చారు. కొందరి వద్ద నమ్మించి బంగారు నగలు తీసుకుని ఇవ్వలేదని పోలీసులకు ఆధారాలు చూపారు. ఇదే గ్రామానికి చెందిన డి.వెంకటరెడ్డి రూ.2.5లక్షలు ఇచ్చారు. లక్ష్మి దంపతులు తిరిగి ఇవ్వకపోవడంతో 15రోజుల క్రితం ఆవేదనతో మృతి చెందాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల క్రితం పి.మంగమ్మ తాను ఇచ్చిన రూ.1.50లక్ష నగదు ఇవ్వమని కోరగా, లక్ష్మి నుంచి సరైన సమాధానం లేకపోవడంతో తన కుమారుడైన సుబ్రహ్మణ్యంకు చెప్పింది. ఆయన మావద్ద తీసుకున్న డబ్బు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. దీంతో తనను హింసిస్తున్నాడని లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇద్దరికి సర్ది చెప్పి పంపేశారు. ఈ విషయం తెలుసుకున్న వృద్ధులు తమ పరిస్థితి కూడా ఇలా అవుతుందేమోనని భయపడి జరిగిన విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో ఈ విషయం గ్రామంలో అందరికీ తెలిసింది. వృద్ధులు ఒక్కొక్కరుగా వెళ్లి లక్ష్మి దంపతులను తమ డబ్బు ఇవ్వాల్సిందిగా కోరారు. మేము ఐపీ పెట్టి.. మా ఇంటికి వచ్చినవారిపై పోలీసు కేసు పెట్టి జైలులో పెట్టిస్తామని బెదిరించారు. దీంతో గ్రామంలోని 15మంది వృద్ధులు తమ వద్ద ఉన్న ప్రామిసరీనోట్లు తీసుకుని శనివారం ఆర్‌సీపురం ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. పోలీసులు కె.లక్ష్మిని స్టేషన్‌కు పిలిపించి విచారించగా, తాను డబ్బులు ఇవ్వలేను... వారి ఇష్టమంటూ తేల్చి చెప్పింది. పోలీసులు చేతులెత్తేశారు. తమ జీవితకాలం దాచుకున్న కష్టాన్ని మోసం చేసి తీసుకున్న లక్ష్మి దంపతులను ఎవరూ శిక్షించలేరా అంటూఒక్కొక్కరు తమ బాధలను చెప్పుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

బీసీ బాలికల హాస్టల్లో నాణ్యతలేని ఆహారం

● వెట్టిచాకిరి చేయిస్తుండటంతో విద్యార్థినుల నిరసన



హాస్టల్ ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

చంద్రగిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలికల బీసీ సంక్షేమ వసతి గృహంలో దయనీయమైన దుస్థితి ఏర్పడింది. విద్యార్థినులకు నాణ్యతలేని ఆహారం పెట్టి, వెట్టి చాకిరీ చేయిస్తుండటంతో విద్యార్థునులు బీసీ సంఘం నాయకులతో కలిసి శనివారం వసతి గృహం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ పట్టణంలోని బీసీ బాలికల వసతి సంక్షేమ గృహంలో వార్డెన్ విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యతమైన ఆహారం పెట్టడంలేదని, వారం రోజులుగా నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వసతి గృహంలో మరుగుదొడ్లు దుర్వాసన వెదజల్లుతూ, అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. పాలల్లో అధికంగా నీరు కలిపి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డెన్ విద్యార్థినుల చేత వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు. హాస్టల్లో విద్యార్థినుల దుస్థితి తెలుసుకున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తురక అమర్నాథ్ ఆధ్వర్యంలో విద్యార్థినులు వసతి గృహం ముందు నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో వెంకటరత్నం వసతి గృహానికి చేరుకుని విద్యార్థినులకు అన్ని సౌకర్యాలు రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. గతంలో కూడా ఇదే హాస్టల్లో పనిచేస్తున్న వార్డెన్‌పై అనేక ఆరోపణలతో విద్యార్థినులు పలు సమస్యలపై అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. విద్యార్థినుల సమస్యలు పరిష్కరించకపోతే రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తామని నాయకులు హెచ్చరించారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, జూలై12(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10.30 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి, ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. ఈకార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై దాడి



దాడికి గురైన ఆటో డ్రైవర్ దేవేంద్రకుమార్

చంద్రగిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద షేర్ ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొన్నందుకు ఆటో స్టాండ్‌లో ఉన్న నలుగురు యువకులు ఆటోడ్రైవర్‌పై దాడి చేశారు. బాధితుడి కథనం మేరకు చంద్రగిరి పట్టణం అక్కగార్ల కాలనీకి చెందిన దేవేంద్రకుమార్ చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ఆటోస్టాండ్‌లో సభ్యుడుగా ఉన్నాడు. చంద్రగిరి నుంచి తిరుపతికి తన ఆటోలో వెళుతుండగా ఆటోస్టాండ్ సమీపంలో ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకోవడంతో స్టాండ్‌లోని ఆటోడ్రైవర్లు దేవేంద్రతో గొడవపడ్డారు. దీంతో దేవేంద్రకుమార్ తన ఆటోలోని ప్రయాణికులను దించేసి, ఇంటికి వెళ్లాడు. అనంతరం స్టాండ్‌లోని మరో డ్రైవర్ ఏకాంబరం, దేవేంద్రకుమార్‌కి ఫోన్ చేసి, స్టాండ్ వద్దకు రావాలన్నారు. దీంతో దేవేంద్రకుమార్ తన ఆటోలో స్టాండ్ వద్దకు రాగానే ఏకాంబరం,మరో ముగ్గురు యువకులు అతడిపై తీవ్రంగా దాడిచేశారు.ఈదాడిలో దేవేంద్రకుమార్‌కు రక్త గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పాకాల రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గేటు వద్ద రోడ్డుపై పట్టాల మరమ్మతులు

రైల్వే గేటు వద్ద మరమ్మతులు

● వాహనాల రాకపోకలకు ఇబ్బందులు

పాకాల, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని పాకాల - నేండ్రగుంట రోడ్డుపై రైల్వే గేటు వద్ద మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి మరమ్మతు పనులు చేస్తుండడంతో రైల్వే గేటు మూసివేశారు. దీంతో ఈ మార్గంలో వెళ్లే వందలాది వాహనాలు సామిరెడ్డిపల్లె, తోటపల్లె వైపు, రైల్వే కాలనీ వైపు మళ్లించారు. ఈ మరమ్మతు పనులు నేటి సాయంత్రం వరకు కొనసాగనున్నట్లు తెలిసింది.

డాక్టర్ పీర్‌కుమార్‌కు ఎన్టీఆర్ జాతీయ అవార్డు



నెల్లూరు(సాంస్కృతికం), జూలై 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ బద్రి పీర్ కుమార్‌కు ఎన్టీఆర్ జాతీయ అవార్డు దక్కింది. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ ఎన్టీ రామారావు, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి ఉత్సవాలు-2025 శనివారం శ్రీత్యాగరాయ గానసభ, కళా వెంకటదీక్షితులు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్‌లో జరిగాయి. తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌజన్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతిభావంతులకు ఎన్టీఆర్, పీవీ నరసింహారావు జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. డాక్టర్ బద్రి పీర్‌కుమార్‌ను ఎన్టీఆర్ జాతీయ అవార్డుతో గుర్రం జాషువా వారసురాలు అమృతపూడి రేవతి, రూప్సీలక్ష్మీబాయి వారసురాలు ఎస్.శాంతాబాయి, సరస్వతీ ఉపాసకులు దైవిజ్ఞ శర్మ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈయన 26 ఏళ్లగా అధ్యాపకుడిగా, నటుడిగా, రచయితగా, ప్రతిభ కనపరుస్తూ విద్య, సినిమా, టీవీ, నాటక కళా రంగానికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా, కళాకారుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తించి ఈ అవార్డు అందజేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ అవార్డు రావడంతో తన బాధ్యత మరింత పెరిగిందని, విద్య, కళారంగానికి తనవంతు సేవలు అందిస్తుంటానని పీర్‌కుమార్ తెలిపారు.

గజలక్ష్మీ నమోస్తుతే..!



గజ వాహనంపై ఊరేగుతున్న పద్మావతిదేవి

తిరుచానూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారికి శనివారం రాత్రి గజవాహన సేవ నయనాందకరంగా సాగింది. అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరాషాఢ పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుగంధ పరిమళ ద్రవ్యాలతో పద్మావతిదేవికి నేత్రపర్వంగా అభిషేకం జరిగింది. రాత్రి అలంకార శోభితురాలైన అమ్మవారు తనకు ప్రీతికరమైన గజవాహనంపై కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. భక్తులు నారికేళ, కర్పూర హరతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌లో విద్యార్థి క్యాబినెట్ ఏర్పాటు



విద్యార్థులతో ఆర్టీవో మురళీమోహన్, సీఐ రామకిశోర్, పక్కన రమాదేవి

తిరుపతి (విద్య), జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక యశోదనగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి శనివారం నూతన విద్యార్థి క్యాబినెట్‌ని ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఆర్టీవో మురళీమోహన్, అలిపిరి సీఐ రామకిశోర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి చదువుతోపాటు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని, మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకుని ఉన్నత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. స్కూల్ చైర్‌పర్సన్ కె.రమాదేవి మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్, క్రమశిక్షణ కలిగిన పౌరులుగా ఎదిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని, ప్రతిఏటా స్కూల్‌లో కొత్త క్యాబినెట్‌ని ఎన్నుకుంటారని తెలిపారు. కొత్తగా కొలువుదీరిన విద్యార్థి క్యాబినెట్‌ని పలువురు అభినందించారు. కరస్పాండెంట్ కె.రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్ కేఆర్ శ్వేతారెడ్డి, ప్రిన్సిపాల్ వై.పద్మశ్రీ, టీచర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంజేపీ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం జూపార్క్ రోడ్డు, ఐతేపల్లె(తాటితోపు)లోని మహాత్మా జ్యోతిబాఫూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల, బాలుర గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి మిగిలి ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు కె.రేష్మ, జి.గిరిధర్ సంయుక్తంగా పేర్కొన్నారు. ఈ పాఠశాలలో 5,6,7,8,9 ఆంగ్ల మాధ్యమ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశానికి ఓల్డ్ చిత్తూరు జిల్లాకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఈనెల 13న ఆదివారం నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి, పూర్తిచేసిన దరఖాస్తులను 18వ తేదీలోపు సమర్పించాలని సూచించారు. దరఖాస్తు కోసం విద్యార్థుల పాస్‌పోర్ట్‌సైజు ఫొటో, ఆధార్‌కార్డు నకలు, ప్రస్తుతం చదువుతున్న తరగతికి చెందిన స్కూల్ స్టడీ సర్టిఫికెట్‌ని వెంటతెచ్చుకోవాలని సూచించారు. ఈనెల 20న బాలికలకు జూపార్క్ రోడ్డులోని ఉదయ మాణిక్యం గురుకుల పాఠశాలలో, బాలురకు తాటితోపులోని పాఠశాలలో ఉదయం 10.30-12-30 గంటలవరకు ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం 90007 83185 (బాలికలు), 63044 68078 (బాలురు) నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బలిజ భవన్ నిర్మాణానికి కృషి

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



బలిజ భవన్ నిర్మాణ కమిటీ ప్రతినిధులతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): బలిజ భవన్ నిర్మాణానికి కృషిచేస్తానని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. బలిజ భవన్ నిర్మాణ కమిటీ ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యేని కలిసి కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బలిజ భవన నిర్మాణ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. దీంతో ఆయనకు నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నగర సంకీర్తనతో ఆధ్యాత్మిక శోభ



నగర సంకీర్తనలో పాల్గొన్న కళాకారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం చేపట్టిన నగర సంకీర్తన అటు భక్తుల్లో, ఇటు స్థానిక ప్రజల్లో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించింది. ఈ సందర్భంగా చేపట్టిన కోలాట ప్రదర్శన, భజనలు ఆకట్టుకున్నాయి. కళాకారులకు రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపీనాథరెడ్డి ప్రసాదాలను అందజేశారు. కస్పా పద్మనాభం, వాసుదేవరెడ్డి, వాసు, మధు, మునిరత్నమాచారి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గీత దాటితే చర్యలు

● వినుతపై బహిష్కరణ వేటే అందుకు నిదర్శనం

- ఎమ్మెల్యే ఆరణి, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పక్కన డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తదితరులు

తిరుపతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ సిద్ధాంతాలు ఉల్లంఘిస్తే ఎంతటి వారిపైనైనా బహిష్కరణ వేటు తప్పదని పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత విషయంలో నిరూపితమైందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే నివాసంలో శనివారం వారు మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుతను జనసేన పార్టీ నుంచి అధిష్ఠానం బహిష్కరించిందన్నారు. చెన్నైలో ఆమెపై హత్యానేరం నమోదు కావడంతో పార్టీ నుంచి తప్పిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకంపై పార్టీ త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జనసేన నాయకులు రాజారెడ్డి, తిరుమల మురళి, రాజేష్ ఆచారి, బాబ్జి, పార్థసారథి పాల్గొన్నారు.

అలరించిన విష్ణుహాసిని భరతనాట్య విన్యాసం

● వీక్షించి ప్రశంసించిన సినీ నటి మంజు భార్గవి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సినీ నటి మంజుభార్గవి, భరత నాట్యం చేస్తున్న విష్ణుహాసిని

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): కుమారి పోకల విష్ణుహాసిని భరత నాట్య విన్యాసం ఆద్యంతమూ ఆకట్టుకుంది. తిరుపతి మహతి కళా క్షేత్రంలో విష్ణు హాసిని భరతనాట్య ఆరంగేట్రం పేరుతో శనివారం సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరాగ రస ఝరి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రదర్శనను వీక్షించిన ప్రఖ్యాత భరతనాట్య కళాకారిణి, సినీ నటి మంజు భార్గవి విష్ణుహాసిని భరతనాట్యం అద్భుతంగా ఉందంటూ కితాబిచ్చారు. ఈ భరతనాట్య ప్రదర్శనకు నట్వాంగంపై కల్యాణి, చిన్నమ్మ(గాత్రం), నరసింహస్వామి(వయోలిన్), చిన్నయ్య (ఫ్లూట్) వాద్య సహకారం అందించారు. అనంతరం విష్ణుహాసినిని సత్కరించారు. కార్యక్రమంలో టీటీడీ మాజీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, మహిళా విశ్వవిద్యాలయ సంగీత, నృత్య విభాగ విశ్రాంతాచార్యులు ద్వారం లక్ష్మి, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల మాజీప్రిన్సిపాల్ ప్రభావతి, భరతనాట్య విభాగాధిపతి కల్యాణి, నిర్వాహకులు కె.విజయభాస్కర్, విష్ణుహాసిని తల్లిదండ్రులు వేణుగోపాల్, శైలజ, కళాభిమానులు పాల్గొన్నారు.

సీఆర్వో ఆధునికీకరణపై టీటీడీ ఈవో పరిశీలన

తిరుమల, జూలై 12(ఆంధ్రజ్యోతి): సామాన్య భక్తులకు గదులు కేటాయించే సీఆర్వో భవనం ఆధునికీకరణపై టీటీడీ ఈవో శ్యామలరావు పరిశీలన చేశారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి శనివారం సాయంత్రం సీఆర్వో వద్దకు వెళ్లారు. సీఆర్వోని ఆధునీకరించేందుకు చేపట్టిన ప్రణాళికలకు సంబంధించి మ్యాప్‌ను పరిశీలించారు. భవిష్యత్తులో యాత్రికుల సంఖ్య మరింత పెరుగుతున్న దృష్ట్యా ఆధునాతన సౌకర్యాలతో సీఆర్వోను అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. తర్వాత పక్కనే నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం-5ను కూడా పరిశీలించారు. భవనంలో వెయిటింగ్ హాళ్లు, శుభ్రత, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ తనిఖీల్లో టీటీడీ సీఈ సత్యనారాయణ, ఈఈ వేణుగోపాల్, డీఈ చంద్రశేఖర్, డిప్యూటీఈవోలు భాస్కర్, సోమన్నారాయణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రాముడు, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిగ్రస్తులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలి



ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు


తిరుపతి(ఆటోనగర్), జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని మధుమేహ వ్యాధిగ్రస్తులు ప్రతి నెలా రక్త పరీక్షలు చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ చైర్మన్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనం వద్ద ఉద్యోగులకు లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులందరూ ప్రతి రోజు వాకింగ్ చేయాలని కోరారు. సంఘం అధ్యక్షులు కెఆర్.శంకర్ మాట్లాడుతూ సంఘం సభ్యుల ఆరోగ్యం కాపాడటానికే వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు శేషాద్రి, మునిక్రిష్ణయ్య, శ్రీరాములు, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో సూచికబోర్డు పెట్టిన రెవెన్యూ



తిరుపతి అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన న్యూమంగళంలోని సర్వేనెంబరు 52/2ఏ లో 3.86ఎకరాల ప్రభుత్వం అనాధీన భూమి ఉంది. దీనిపై కన్నేసిన కొందరు భూకబ్జాదారులు గత నెలలో రాత్రికి రాత్రే చదునుచేసి ప్లాట్స్ వేసి విక్రయించే ప్రయత్నం చేశారు. ఈ సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు అడ్డుకొని ఈ భూమి ప్రభుత్వ అనాధీనమంటూ హెచ్చరించి పంపివేశారు. ఆ తరువాత కూడా వారు ప్రయత్నాలు మానుకోకపోవడంతో తిరుపతి అర్బన్ మండలం తహసీల్దార్ సురేష్‌బాబు ఆదేశాలతో మంగళం వీఆర్వో సతీష్ ఆధ్వర్యంలో శనివారం ఆ భూమిలో సిమెంట్ కాంక్రీటుతో దృఢంగా సూచికబోర్డు ఏర్పాటు చేశారు. ఇకపై ఈ భూమిని ఆక్రమణ చేయడానికి ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడునంటూ బోర్డులో హెచ్చరించారు.

తిరుపతిని బాలాజీ రైల్వే డివిజన్‌గా ప్రకటించండి



మీడియాతో మాట్లాడుతున్న వేణుగోపాలరెడ్డి, బుజ్జిబాబు తదితరులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన అనంతరం విశాఖను రైల్వే జోన్ ప్రకటించినట్లే తిరుపతిని బాలాజీ డివిజన్‌గా ప్రకటించాలని తిరుపతి ఫిల్మ్ సొసైటీ చైర్మన్, ఎం. వేణుగోపాల రెడ్డి,విజనరీ గ్రూప్ సభ్యుడు ఎస్.బుజ్జిబాబు నాయుడు డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ తిరుపతి రైల్వే స్టేషన్‌లో రూ300 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నారని, అయితే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాలను పెంచాలని కోరారు.కనీసం 8ప్లాట్‌ఫారాలైనా వుండాలన్నారు. తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్, తిరుచానూరు, పాకాల, రేణిగుంట రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి రైల్వే స్టేషన్‌కు ఇరు వైపులా సర్క్యులేటింగ్ ఏరియాను పెంచాలని కోరారు.పాకాలలో రైల్వేకి వందల ఎకరాల స్థలమున్నందున తిరుపతిలో వున్న పిట్‌లైన్లను అక్కడకు మార్చకోవచ్చన్నారు.ఈ సమావేశంలో భాస్కర్,మధుసూదన యాదవ్, సుబ్బరాయులు నాయుడు, ప్రభాకర రావు, నారాయణ నాయుడు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటికి ఘన స్వాగతం



మంత్రి రవికుమార్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు

తిరుపతి(ఆటోనగర్), జూలై 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి జిల్లాల పర్యటనలో భాగంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా తిరుపతి, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. భవిష్యత్తులో లోవోల్టేజ్ సమస్యలు రాకుండా అవసరమైన ప్రాంతాల్లో అదనంగా 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. మంత్రి స్పందించి విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరుకు ఏపీఈఆర్‌సీ పరిశీలించి అనుమతిస్తుందని చెప్పారు.

22న నగర నాయీబ్రాహ్మణ సంఘం ఎన్నికలు

తిరుపతి(ఆటోనగర్), జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి యూత్ హాస్టల్‌లో ఈ నెల 22న తిరుపతి నగర నాయీబ్రాహ్మణ సంఘం ఎన్నికలు నిర్వహించనున్నామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆవులపాటి బుజ్జిబాబు వెల్లడించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల సంఘం తమదేనని పలువురు చెప్పుకుంటున్నారని తెలిపారు. తమ సంఘంలో ప్రస్తుతానికి 850 మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. మరో 150 మంది పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఎన్నికలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల్లో అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారిని ఎన్నుకుంటారని తెలిపారు. నగర పరిధిలో వున్న నాయీబ్రాహ్మణులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు రామనారాయణ, ద్వారకనాథ్, సురేంద్ర పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ చేతి వాటం

● పార్శిల్‌లో వచ్చిన ఇనుప రాడ్ల చోరీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఒక పార్శిల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆటోడ్రైవర్ చేతి వాటం ప్రదర్శించి పార్శిల్‌లో వచ్చిన ఇనుప రాడ్లను దొంగలించిన ఉదంతం శనివారం వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ ఎస్‌ఐ గిరిబాబు కథనం మేరకు స్థానిక డీఆర్ మహల్ రోడ్డులో వున్న త్రిబుల్ ఆర్ పార్శిల్ కార్యాలయంలో సాయికుమార్ అనే ఆటోడ్రైవర్‌గా కొంత కాలంగా నమ్మకంగా పనిచేస్తున్నాడు. శనివారం బయట ప్రాంతం నుంచి తిరుపతికి ఇనుప రాడ్లు త్రిబుల్ ఆర్ పార్శిల్ కార్యాలయానికి వచ్చాయి. వీటిని ఆటోలో తీసుకెళ్లి బుక్ చేసిన వారికి డెలివరీ ఇవ్వాల్సి వుంది. దీనికోసం ఆటోలో పెట్టి తీసుకెళుతున్నట్లు నటించాడు. పార్శిల్‌లో వున్న కొన్ని ఇనుప రాడ్లు చోరీ చేసి ఆటోను అక్కడే వదలి వెళ్లాడు. జరిగిన ఘటనపై బాధితుడు పార్శిల్ కార్యాలయం మేనేజర్ రాజశేఖర్‌కు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో మేనేజర్ ఈస్ట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

3న జిల్లాస్థాయి యోగాసనాల పోటీలు

తిరుపతి(క్రీడలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 3న స్థానిక మంచినీళ్ల గుంట ఎల్‌బీసీ రోడ్డులోని విద్యోదయ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ప్రాంగణంలో జిల్లాస్థాయి యోగాసనాల పోటీలు నిర్వహించనున్నట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కైలాససింగ్ రాజ్‌పురోహిత్, కార్యదర్శి మునిమంజుల శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10నుంచి 55 సంవత్సరాల వయస్సు గలవారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా 12 ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తారు. గెలుపొందినవారు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. ఆసక్తిగలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 99853 94350, 99080 42143, 94904 2270నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.


యూబీఐ అటెండర్ ఇంట్లో చోరీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కాపురముంటూ యూనియన్ బ్యాంక్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న ఒక మహిళ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఇంట్లో వున్న దాదాపు రూ.లక్ష విలువ చేసే బంగారు నగలు అపహరించుకుని వెళ్లారు. బాధిత మహిళ నిర్మల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్‌ఐ హేమాద్రి కథనం మేరకు స్థానిక భవానీనగర్‌లో కాపురమున్న నిర్మల ఎస్వీయూలోని యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నారు. తమ ఇల్లు చిన్నదిగా ఉండటంతో భర్త నారా నాగయ్య, నిర్మల పక్కింటిలోకి వెళ్లి పడుకున్నారు. ఇంటిలో ఎవ్వరూ లేరని గమనించిన దొంగలు తాళాలు పగులకొట్టారు. బీరువాలో వున్న దాదాపు రూ.లక్ష విలువ చేసే 32 గ్రాములు బంగారు నగలు అపహరించుకుని వెళ్లారు. శనివారం ఉదయం ఇంటి వద్దకు వెళ్లి చూడగా తాళాలు పగులకొట్టి ఉండడం గమనించారు. బీరువాలో వున్న నగలు పరిశీలించగా, కనిపించక పోవడంతో వారు ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ హేమాద్రి కేసు నమోదు చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల పట్ల తెలుగు యువత హర్షం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన రూ. 600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం పట్ల తెలుగు యువత హర్షం వ్యక్తం చేసింది. వందల కోట్ల పెండింగ్ బకాయిల విడుదల ద్వారా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను సర్వనాశనం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాడిలో పెట్టడానికి కృషి చేస్తూ ఉందన్నారు. ఇందుకు కూటమి ప్రభుత్వానికి తెలుగు యువత పక్షాన ఆనంద్‌గౌడ్ కృతజ్ఞతలు తెలియచేశారు.

పశువులకు పాచిపట్టిన నీళ్లా..!



తిరుపతి అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పాచిపట్టిన నీరు ఎలా తాగాలని పశువులు గగ్గోలు పెట్టవులే.. ఎలా ఉంటే ఏమి, నీరు అందుబాటులో ఉంది కదా అన్నట్లుగా ఉన్నాయి పశువుల నీటి తొట్టెలు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇటీవల మంగళం పరిధిలో నిర్మించిన మూడు పశువుల నీటి తొట్టెలు నిర్వహణ లేక పోవడంతో పాచిపట్టి కళావిహీనంగా తయారయ్యాయి. ప్రారంభించినప్పటి నుంచి ఒక్కసారి కూడా శుభ్రం చేసినట్లు కనబడలేదు. దీంతో తొట్టెల అడుగుభాగంలో, నీటిపై కూడా చక్కగా పరిచినట్లు పాచి పేరుకుపోయి తేలుతోంది. అశుభ్రతతో కంపుకొడుతోంది. గ్రామస్తులు, పశువుల కాపరులు కూడా పట్టించుకోకపోవడం గమనార్హం. సంబంధిత విభాగం స్పందించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

సుపరిపాలనపై ప్రజల్లో సంతృప్తి

● పలు డివిజన్లలో సందడిగా తొలిఅడుగు



తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునిక్రిష్ణ, మహేష్ యాదవ్ తదితరులు

తిరుపతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని చేపడుతున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం వాడవాడలా సందడిగా కొనసాగుతోంది. శనివారం స్థానిక 29వ డివిజన్‌లోని కుమ్మరితోపు వద్ద టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో జరిగింది. గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను పార్టీ నాయకులు వివరించారు. ఈకార్యక్రమంలో నాయకులు బుల్లెట్ రమణ, చినబాబు, రామ్మూర్తి రాయల్, పొటకం వెంకటేష్, డివిజన్ నాయకులు విశ్వనాథం, కల్పన, జయంతి, జుబేదా, రాజారాం, నరేష్ తదితరులు పాల్గొన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, క్లస్టర్ ఇంచార్జి ఆర్సీ మునిక్రిష్ణ, టీడీపీ నగరప్రధాన కార్యదర్శి యూనిట్ ఇంచార్జ్ మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో 35, 42వ డివిజన్లలో ప్రభుత్వ పాలన గురించి గడపగడపకు వెళ్లి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ప్రశాంతపాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ అధ్యక్షుడు ఎస్వీఎం శ్రీధర్, 42వ డివిజన్ అధ్యక్షుడు రూపేష్, నాయకులు జగ్గా, చంద్రారెడ్డి, రవితేజ నాయుడు, లక్ష్మి, సురేష్, ప్రశాంత్, దాము, శరత్, ముని లక్ష్మి, వెంకటేశు, రజిత, రవి, కార్తీక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు ఆహారంగా చెత్త, వ్యర్థాలు



రోడ్డుపక్కన పడేసిన చెత్తను తింటున్న ఆవులు

తిరుపతి రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం జాతీయ రహదారికి ఆనుకుని మదర్ డెయిరీ మీదుగా గాంధీపురం పంచాయతీకి వెళ్లే మట్టిరోడ్డు మార్గంలో పలుచోట్ల చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను పడేసి వెళుతున్నారు. దీంతో అటువైపుగా వెళ్లే మూగజీవాలు ప్లాస్టిక్‌తోపాటు కుళ్లిన వ్యర్థాలను తిని అనారోగ్యం పాలవుతున్నాయి. ఖాళీప్రదేశంలో రోడ్డు పక్కన చెత్తవేస్తే అపరాధ రుసుం వేస్తామని పంచాయతీ అధికారులు హెచ్చరించినా కొందరు గుట్టుచప్పుడు కాకుండా పడేసి వెళుతున్నారు. పంచాయతీ పరిధిలో పడేసిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను అక్కడ సంచరించే ఆవులమంద తింటున్న దృశ్యం శనివారం ఉదయం కనిపించింది. ఇక ఆవుల యజమానులు తమకేమీపట్టనట్లు రోడ్లపైకి వదిలేస్తుండడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు విషమని తెలియక మూగజీవాలు ఆహారంగా తీసుకుంటున్న పరిస్థితి. వేంత కాకుండా ఇలాంటి ప్రమాదకర వ్యర్థాలను ఆహారంగా తీసుకునే ఆవులు అనారోగ్యం బారినపడడంతోపాటు వాటి పాలని ఆహారంగా తీసుకునే మనుషులకు కేన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు సోకే అవకాశం ఉందని వైద్యరంగ నిపుణులు అంటున్నారు.

తైక్వాండో బ్లాక్‌బెల్ట్ పరీక్షలు విజయవంతం



బ్లాక్ బెల్ట్ అందుకున్న తైక్వాండో క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో శనివారం తైక్వాండో బ్లాక్‌బెల్ట్ పరీక్షలు విజయవంతంగా జరిగాయి. ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, కడప జిల్లాల నుంచి 20మంది తైక్వాండోలో పరిణితి చెందిన క్రీడాకారులు హాజరు కాగా, వీరిలో హేమంత్, హరినాథ్, దీక్షిత్, రెయాన్, శ్రీవల్లి, అమృత, హారిక, యువరామిరెడ్డి, వేదాభిరామిరెడ్డి, కర్తవరాజనరాయుడు, పునీత్‌రెడ్డి బ్లాక్‌బెల్ట్‌కు అర్హత సాధించారు. ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, గ్రాండ్ మాస్టర్ కె.వి.బాబూరావు క్రీడాకారులకు బ్లాక్‌బెల్ట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ తైక్వాండో రెఫరీ సుదర్శన్, రాష్ట్ర తైక్వాండో సంఘం ఉపాధ్యక్షులు బి.ఆనంద్‌రావు, వెంకటేష్, బాలకృష్ణ, రామకృష్ణ, రవిశంకర్, మునీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం



మీడియాతో మాట్లాడుతున్న ఉమాపతి ఆచారి

తిరుపతి(ఆటోనగర్), జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో భక్తిభావాలను పెంచడానికి ఆదివారం మహతిలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల 7వ కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఏపీ విశ్వబ్రాహ్మణ(విశ్వకర్మ) సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.ఉమాపతి ఆచారి, కె.గిరిబాబు ఆచారి వెల్లడించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 7గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమై మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో వున్న వీరబ్రహ్మేంద్ర స్వామి భక్తులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మువ్వల శంకరాచారి, కె.గోపిఆచారి, కె.కమల్‌నాథ్ ఆచారి, ఎం.కార్తీక్ ఆచారి, చంద్రాచారి పాల్గొన్నారు.

నేడు రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ వార్షికోత్సవం



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల

తిరుపతి(ఆటోనగర్), జూలై 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో ఆదివారం రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల వెల్లడించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 10వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న నిర్వాహకులను సత్కరించనున్నట్లు చెప్పారు. సామాజిక కార్యకర్తలను గౌరవించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, డాక్టర్ సుద్దాల అశోక్ తేజ, డాక్టర్ మేడసాని మోహన్, కమిషనర్ ఎన్.మౌర్యతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో భార్గవ్, దేవరాజులు, ఎన్.మునిలక్ష్మి పాల్గొన్నారు.

వైసీపీ నిరసన




తిరుపతి ముఖ ద్వారం వద్ద నిరసన తెలుపుతున్న భూమన అభినయ్ తదితరులు

తిరుపతి(జీవకోన), జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి కరకంబాడి ప్రధానరోడ్డులో ఏర్పాటుచేసిన సెంటర్ లైటింగ్ అలంకారప్రాయంగా ఉందని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ అన్నారు. సెంటర్ లైటింగ్‌ను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం తిరుపతి ముఖద్వారం వద్ద(మంగళం దగ్గర) రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో వైసీపీ హయాంలో టీటీడీ వెన్నుదన్నుతో సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ వీధి దీపాలు ఏడాదిగా వెలగకుండా భక్తులు అవస్థలు పడుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా సెంటర్ లైటింగ్‌ను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు వైసీపీ కార్యకర్తలను అక్కడినుంచి పంపించి వేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని వైసీపీ నేతలపై తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర మంత్రులుఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, బీసీసీఐ స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ కోచ్ అంకిత్ కలియార్, సినీ హీరో సంతోష్ శోభన్, నటుడు అశోక్ బాబు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



ఆనం రామనారాయణరెడ్డి - కొల్లు రవీంద్ర - సంతోష్ శోభన్ - అశోక్‌బాబు

అతి త్వరలో వంద భాషల్లో శ్రీమద్ భగవద్గీత

● గాయకుడు గజల్ శ్రీనివాస్



తిరుమల, జూలై12(ఆంధ్రజ్యోతి): శ్రీమద్ భగవద్గీతను అతి త్వరలో నూరు భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏడాదిగా శ్రీమద్ భగవద్గీతను నూరు భాషల్లో చేయాలనే యజ్ఞంలో కృషి చేస్తున్నామన్నారు. తెలుగు, సంస్కృతంలో తాను పాడిన భగవద్గీతను తిరుపతిలో విడుదల చేసి స్వామికి అంకితం చేస్తామన్నారు.

శ్రీహరి దర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.84 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 70,217

తలనీలాలు సమర్పించినవారు: 31,155



గజరాజుల కట్టడికి యాక్షన్‌ప్లాన్



● దక్షిణాది రాష్ట్రాల సమాలోచనలు ● నోడల్ కమిటీకి నివేదిక అందజేసిన సబ్ కమిటీ

మంగళం, జూలై 12(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఏనుగుల దాడులు పెద్దసమస్యగా మారింది. ఈ క్రమంలో 2024 డిసెంబరు 18న తమిళనాడు మాజీ పీసీసీఎఫ్ సంజయ్ కె శ్రీనివాస్ ఛైర్మన్‌గా ఆరుగురితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సబ్ కమిటీ తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో ఏనుగుల సంతతి, వాటి కదలికలు, ప్రజల ఆస్తులు, ప్రాణాలకు నష్టం కలగకుండా ఎలా కట్టడి చేయాలి అనే దానిపై యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. పూర్తి స్థాయిలో పరిశీలించి, నివేదికను నోడల్ కమిటీకి అందజేసింది.

ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల పరిశీలన

దక్షిణాది రాష్ట్రాల సంయుక్త ఆధ్వర్యంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో ఏర్పడిన నోడల్ కమిటీ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఏనుగులు ప్రవేశించే, అవి తిరిగి వెళ్లే మార్గాలను రెండు రోజుల క్రితం పరిశీలించింది. ఏనుగులు ఎక్కువగా సంచరిస్తున్న పలమనేరు, తలకోన, కల్లూరు, భీమవరం, బాలపల్లి, మామండూరు, తిరుమల నడక మార్గంలోని ఏడవ మైలును సందర్శించింది. శేషాచల కొండల్లోకి వస్తున్న ఏనుగులు సమీప భాకరాపేట, కల్లూరు, మామండూరు, బాలపల్లి, భీమవరం తదితర ప్రాంతాల్లో పంటలపై దాడి చేస్తున్న విషయాలను అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. అనేక సందర్భాల్లో రైతుల ప్రాణాలను కూడా బలి తీసుకున్నట్లు ఆయా ప్రాంతాల వారు కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలోనూ ఈ కమిటీ పర్యటిస్తోంది. కేరళ నుంచి తమిళనాడు, కర్ణాటక మీదుగా ఆంధ్ర రాష్ట్రంలోకి ఏనుగుల మంద ఎప్పుడు వచ్చింది.. అందులో ఎన్ని ఏనుగులు ఉన్నాయి.. అవి ప్రయాణించే మార్గం, ఎక్కడెక్కడ ఎంతకాలం ఉంటున్నాయి.. ఆ సమయంలో జరుగుతున్న ఆస్తి, ప్రాణ నష్టాల గురించి తెలుసుకుంటున్నారు. ఆ తర్వాత వీటిని నిలువరించడానికి గల అవకాశాలను పరిశీలిస్తారు. అదే సమయంలో అవసరమైన ఆహారం, నీరు పుష్కలంగా లభించే ప్రాంతాలను గుర్తిస్తారు. వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపైనా కసరత్తు చేస్తున్నారు. వీటన్నింటిపై పూర్తి స్థాయిలో నివేదిక రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తారు. కమిటీ తీసుకున్న నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయగలిగితే మేలు జరిగే అవకాశముంటుందని రైతులు భావిస్తున్నారు.




ఏనుగులు తిరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న నోడల్ కమిటీ సభ్యులు

ప్రీ-నేషనల్స్‌కు జిల్లా షూటర్స్ ఎంపిక



ప్రీ-నేషనల్స్‌కు ఎంపికైన జిల్లా షూటర్స్

తిరుపతి(క్రీడలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలోని ఎన్టీఆర్ కేవీకే 10మీటర్ల ఎయిర్ రైఫిల్/పిస్టల్ షూటింగ్ కేంద్రంలో శిక్షణ పొందిన పదిమంది షూటర్లు ప్రీ-నేషనల్స్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రేంజ్‌లో ఇటీవల హైదరాబాదు గచ్చిబౌలిలో రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 11మంది ప్రాతినిథ్యం వహించారు. ఇందులో లవకుమార్, సాయిఅచ్యుత్‌రాయల్, హేమచంద్, పురుషోత్తం, భార్గవి, హస్విత, యోక్షిత, నందగోపాల్, హితేష్, వైష్ణవీలు నేషనల్స్‌కు ఎంపికయ్యారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ కేవీకేలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.దేవరాజ్, డీఎస్‌డీవో శశిధర్ ఆధ్వర్యంలో క్రీడాకారులను సన్మానించి, అభినందించారు. సంఘం ఉపాధ్యక్షుడు సిద్ధయ్య, కార్యదర్శి డాక్టర్ భానుప్రకాష్, జయరాజ్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



గ్రాప్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మాణిక్యాలు

తిరుపతి(క్రీడలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య కూడలి సమీపంలోని గిరిజన భవన్‌లో శనివారం సాయంత్రం 5వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఏపీ క్రీడా భారతి అధ్యక్షుడు ఎం.వి.మాణిక్యాలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. సబ్ జూనియర్, క్యాడెట్(బాలబాలికలు) విభాగాల్లో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన అథ్లెట్లను ఆయన పరిచయం చేసుకున్నారు. క్రీడల ద్వారా యువతలో శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ క్రీడా భారతి కార్యదర్శి ధనంజయరెడ్డి, సంయుక్త కార్యదర్శి సురేంద్రరెడ్డి, డీఎస్‌డీవో ఎన్.శశిధర్, ఏపీ గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు రేఖారాణి పాల్గొన్నారు.

చంద్రగిరిలో మ్యాట్రిక్ థర్మల్ 4 డ్రోన్‌తో నైట్ బీట్

● చిమ్మచీకట్లో ఆటోలో మద్యం తాగిన నలుగురి గుర్తింపు



యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

చంద్రగిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తొండవాడ, బీడీ కాలనీ, జడ్పీ హైస్కూల్ ప్రాంతంలో పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి మ్యాట్రిక్ థర్మల్ 4 డ్రోన్ కెమెరాతో నైట్ బీట్ నిర్వహించారు. తొండవాడ జాతీయ రహదారి సమీపంలోని చెట్ల పొదల్లో చీకట్లో ఓ ఆటోలో నలుగురు వ్యక్తులు మద్యం తాగుతున్న దృశ్యాలు ఇందులో రికార్డు అయ్యాయి. వెంటనే డ్రోన్ టీమ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు అక్కడికి చేరుకుని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. రాత్రి 8 గంటల తర్వాత పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం ఉంటుందన్న విషయాన్ని గుర్తు చేశారు.

హిందూ ఆలయాల యువచైతన్య మహాపాదయాత్ర ప్రారంభం



ఎర్రావారిపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) హిందూ దేవాలయాల యువచైతన్య మహాపాదయాత్రను శ్రీభువనగిరి పీఠాధిపతి కమలానంద భారతి ఆధ్వర్యంలో శనివారం తలకోన నుంచి ప్రారంభమైంది. 8నెలల పాటు సాగే పాదయాత్ర గురించి ఆయన మాట్లాడుతూ 'భగవద్భక్తి-కర్తవ్యదీక్ష-సమాజశక్తి' నినాదంతో తలకోన నుంచి సాధుసంపత్‌లు యాత్ర సంకల్పించారని చెప్పారు. సనాతన హైందవ ధర్మపరిరక్షణ, దేవాలయాలు, సంస్కృతాంధ్ర భాషా పరిరక్షణ, హిందూ యువ చైతన్యం లక్ష్యాలతో యాత్ర కొనసాగుతుందని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి, కర్నూలు, అనంతపురం, నారాయణపేట, గద్వాల్, వనపర్తి, నంద్యాల, కడప, నెల్లూరు జిల్లాల్లో 6 నెలల్లో 8 వేల గ్రామాల్లో పాదయాత్ర జరుగుతుందని వివరించారు. ఫిబ్రవరిలో తిరుపతిలో ధార్మిక మహాసమావేశంతో ముగియనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు రాఘవులు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, టీడీపీ నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు హేమాంబరధర నాయుడు, తలకోన ట్రస్ట్ ఛైర్మన్ సోమనాథరెడ్డి, ఈవో రవీంద్రరాజు, టీడీపీ మండల నాయకులు గోపి, కేశవుల నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వేద విశ్వవిద్యాలయ వార్షికోత్సవం

● సుదర్శన సహిత పారమాత్మిక హోమం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ 20వ వార్షికోత్సవం అత్యంత వేడుకగా సాగింది. ఉదయం సుదర్శన సహిత పారమాత్మిక హోమం చేపట్టారు. అనంతరం నిర్వహించిన సభలో వీసీ ప్రొఫెసర్ రాణిసదాశివమూర్తి, రిజిస్ట్రార్ భాస్కరుడు పాల్గొని మాట్లాడారు. టీటీడీ సహకారంతో రెండు దశాబ్దాలుగా వేద విజ్ఞాన వ్యాప్తిలో వేద యూనివర్సిటీ ఎంతో కృషి చేసిందన్నారు. ఎంతో మంది వేద పండితులను తీర్చిదిద్దిందని తెలిపారు. వేద విజ్ఞానంపై విలువైన పరిశోధనలు సాగాయన్నారు. అనేక విలువైన వేద సంబంధ గ్రంథాలు ప్రచురించినట్లు చెప్పారు. అనేక మంది వేద పండితులు యూనివర్సిటీని సందర్శించారని తెలిపారు. వేద సంబంధ విషయాలపై సదస్సులు, వర్క్‌షాప్‌లు చేపట్టినట్టు వివరించారు. వేద, ఆగమ, పౌరోహిత్య, వేదాంగ, వేద భాష్యాలపై విస్తృత అధ్యయనం సాగుతున్నట్టు వివరించారు. శ్రీవారి అనుగ్రహం, టీటీడీ అధ్యక్షులు, ఈవోల సహకారంతో ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు. విద్యార్థులకు వస్త్రాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేద విశ్వవిద్యాలయంలో హోమం నిర్వహిస్తున్న పండితులు

వార్షికోత్సవ వేళ రాజకీయ వివాదం!

● హాజరుకాని బీజేపీ, టీడీపీ నాయకులు

వేద విశ్వవిద్యాలయ వార్షికోత్సవ వేళ రాజకీయ వివాదం రేగింది. టీటీడీ సహకారంతో నిర్వహిస్తున్న వేద విశ్వవిద్యాలయం వార్షికోత్సవానికి టీటీడీ ఛైర్మన్‌ను, ఈవోను, యూనివర్సిటీ అధికారులను ఆహ్వానించలేదనే ఆరోపణలు వినిపించాయి. దీనికి కారణాలు ఏమిటనే విషయాన్ని పక్కనపెడితే స్థానిక బీజేపీ, టీడీపీ నేతలను మచ్చిక చేసుకోవడానికి వేద వర్సిటీ ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారనే విమర్శ తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో పలు అధికారిక హోదాల్లో ఉన్న స్థానిక బీజేపీ, టీడీపీ నాయకులను వార్షికోత్సవానికి ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికలోనూ వారి పేర్లను ముద్రించారు. అయితే తుదకు వారు కార్యక్రమానికి హాజరుకాలేదు. ఇలాంటి పరిస్థితుల మధ్య వేద వర్సిటీ వార్షికోత్సవం సాగింది. ఈ వివాదం ఎక్కడికి దారితీస్తుందనేది ఆసక్తిగా మారింది.

జీవన మార్గాన్ని ఉపదేశించిన శ్రీమద్భగవద్గీత గజల్ గానం

● గజల్ గానంతో ఆహూతులను మంత్రముగ్ధులను చేసిన గజల్ శ్రీనివాస్



గజల్స్ గానం చేస్తున్న గజల్ శ్రీనివాస్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, నైతిక జీవన మార్గాన్ని ఉపదేశించేలా శ్రీమద్భగవద్గీత సారాన్ని ప్రఖ్యాత గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ తన స్వరంలో ఒలికించారు. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో 'శ్రీమద్భగవద్గీత' గజల్ గానం నిర్వహించారు. భగవద్గీతలోని శ్లోకాలను రాగయుక్తంగా ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఎంతో సాంస్కృతిక వైభవం గల తిరుపతిలో ఇటువంటి కార్యక్రమాన్ని మరింత సాంస్కృతిక శోభను తెస్తాయని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని కోరారు. టీటీడీ మాజీ ఛైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ తిరుపతిలో జీవించడమే గొప్ప అదృష్టమన్నారు. పవిత్రమైన తిరుపతిలో ఇటువంటి కార్యక్రమాలు మరింత మంచి వాతావరణాన్ని కలుగ చేస్తాయన్నారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా తిరుపతి కేంద్రంగా అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉందన్నారు. ఈ క్రమంలో భగవద్గీతను గజల్ శ్రీనివాస్ నోట వినడం గొప్పగా ఉందన్నారు. గజల్ శ్రీనివాస్ ఆలపించిన గజల్ ఆడియో పెన్‌డ్రైవ్‌ను ఆవిష్కరించారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఉమా ముద్దుబాల బృందం ప్రదర్శించిన అష్టలక్ష్మీ వైభవం అత్యద్భుతంగా సాగింది. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్, ఉమా ముద్దుబాల, ఇతర అతిథులను అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గౌరవ కార్యదర్శి పాండ్ర సురేంద్ర నాయుడు సత్కరించారు. సభను ఆకెళ్ల విభీషణశర్మ సమన్వయం చేశారు. పలువురు కళాకారులు, కళాభిమానులు, నగర వాసులు పాల్గొన్నారు.



అష్టలక్ష్మీ వైభవం నృత్య రూపకంలో ఉమా ముద్దుబాల బృందం

తిరుపతిలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

● పార్కింగ్ నిబంధనలపై ప్రైవేటు వాహనాల యజమానులకు సూచనలు

● అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిక

తిరుపతి(నేరవిభాగం), జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీలు భక్తవత్సలం, రామకృష్ణమాచారి, సీఐలు, రిజర్వు బలగాలు, ఎస్టీఎఫ్ ఫోర్సుతో కలిసి నగరంలోని 10 ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పూర్ణకుంభం సర్కిల్ నుంచి భారతి బస్టాండు వద్దకు నడుచుకుంటూ వెళ్లారు. ప్రైవేటు బస్సులు రోడ్డుపై ఇష్టమొచ్చినట్లు పెట్టడంతో అసహనం వ్యక్తం చేశారు. పద్ధతిలో పెట్టుకునే విధంగా చూడాలని ఆదేశించారు. అక్కడి నుంచి ట్రావెల్స్ ఆఫీసుల వద్దకు వెళ్లి మేనేజర్లను పిలిపించి బస్సులను ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా పెట్టవద్దని సూచించారు. అక్కడే నడి రోడ్డుపై ఆపి ఉన్న ఆటోను పరిశీలించి ట్రాఫిక్ సీఐను పిలిచి జరిమానా వేయాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఆటోలను పరిశీలించారు. ఆటోలకు డిజిటల్ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ రామకృష్ణమాచారిని ఆదేశించారు. బస్టాండులో కొందరు ప్రయాణికులతో ముచ్చటించారు.



ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిమ్మినాయుడుపాలెంలో సమస్యలపై ఆరా

తిమ్మినాయుడుపాళానికి వెళ్లిన ఎస్పీ స్థానికులతో ముచ్చటిస్తూ పోలీసు శాఖ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఆకతాయిల ఆగడాలు, పోలీసులు రాత్రి గస్తీలపై అడిగి తెలుసుకున్నారు. డ్రోన్‌లతో మందుబాబులు, యువత, రౌడీలు, ఆకతాయిలు భయపడుతున్నారని, ఊరు ప్రశాంతంగా ఉందని స్థానికులు వివరించారు. అవిలాల, చంద్రగిరి, జీవకోన, ఎస్టీవీనగర్, మంగళం, తిరుచానూరు ప్రాంతాల్లో తనిఖీలు చేసి ప్రజలకు భరోసా కల్పించారు. దాదాపు రెండు గంటల పాటు తనిఖీలు చేశారు.

విమానాశ్రయ ప్రైవేటీకరణను ఆపండి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్



నిరసన తెలుపుతున్న చింతామోహన్

రేణిగుంట, జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రైవేటీకరణ చేయరాదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. చింతామోహన్ మాట్లాడుతూ తిరుపతి విమానాశ్రయాన్ని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా అంతర్జాతీయ స్థాయికి పునాది వేశారని గుర్తు చేశారు. రాయలసీమలో ఇది ఒకే ఒక అంతర్జాతీయ విమానాశ్రయమని తెలిపారు. దీన్ని అదానీకి అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం ఫైలు సిద్ధం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రావణ, వడివేలు, మురళి, సురేష్ ,శివ, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీపై బండి వ్యాఖ్యలు ఆక్షేపణీయం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన), జూలై 12(ఆంధ్రజ్యోతి): టీటీడీ గురించి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆక్షేపిస్తున్నామని వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఒక ప్రకటనను శనివారం వీడియో ద్వారా విడుదల చేశారు. టీటీడీలో వెయ్యిమందికి పైగా అన్యమత ఉద్యోగులు ఉన్నారని బండి సంజయ్ చెప్పడం సరికాదని, వారిని తొలగించాలంటూ హెచ్చరించడాన్ని తప్పుబట్టారు. ఈ వ్యాఖ్యలు శ్రీవారి ఆలయంపై దాడిలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల వెనుక కుట్ర దాగి ఉందన్న అనుమానం కలుగుతోందని తెలిపారు. టీటీడీని ప్రక్షాళన చేస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం బండి వ్యాఖ్యలను సమర్థించడం సరికాదని పేర్కొన్నారు.

తిరుమలలో సర్వే చేసి అన్యమతస్థులుంటే తొలగిద్దాం

● భూమనకు భానుప్రకాష్‌రెడ్డి సవాల్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 12(ఆంధ్రజ్యోతి): 'తిరుమలలో ఇంటింటి సర్వే చేద్దాం... ఎవరి ఇళ్లలోనైనా అన్య దేవుళ్ల సాహిత్యం, చిత్రపటాలు కనిపించినా ఆ ఉద్యోగులను టీటీడీ ఉద్యోగాల నుంచి తొలగిద్దాం... మీరు సహకరిస్తారా' అని మాజీ ఎమ్మెల్యే, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆ మేరకు ఆయన శనివారం ఓ వీడియో విడుదల చేశారు. టీటీడీలో వెయ్యిమంది అన్యమతస్తులు ఉన్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల వెనుక కుట్ర దాగి ఉందని భూమన పేర్కొనడాన్ని భానుప్రకాష్‌రెడ్డి ఖండించారు. '2019 నుంచి 2024 వరకు హిందూ వ్యతిరేక ప్రభుత్వం రాజ్యమేలింది. ఓ నాస్తికుడు టీటీడీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. హిందూ ఆలయాలు, పవిత్ర రథాలపై దాడులు జరిగాయి. టీటీడీ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా భారీ అవినీతికి పాల్పడ్డారు' అంటూ ధ్వజమెత్తారు. తిరుమలలో కొందరు పేరుకు రాముడు, కృష్ణుడుగా ఉన్నారు గాని వారి ఇళ్లలో మాత్రం ఏసు చిత్రపటాలు ఉంటున్నాయన్నారు. కరుణాకరరెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఇంటింటి సర్వేకు అంగీకరించి తమకు సహకరించాలని కోరారు.

క్రీడల్లో పతకాలు సాధించిన టీటీడీ వీఎస్వోలకు అభినందన



తిరుమల, జూలై12(ఆంధ్రజ్యోతి): ఇటీవల అమెరికాలో జరిగిన ప్రపంచ పోలీసు క్రీడల్లో బంగారు, కాంస్య పతకాలను సాధించిన టీటీడీ విజిలెన్స్ వీఎస్వోలను టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు శనివారం అభినందించారు. తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో వీఎస్వోలు రామ్‌కుమార్, సురేంద్ర ఛైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పతకాలను చూపించారు. టీటీడీ ప్రతిష్ఠను మరింత పెంచేలా విజయం సాధించినందుకు వారిని ఛైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు.

పుత్తూరు వార్తలు

శోభాయమానం... ప్రసన్న వెంకన్న పుష్పయాగం



వడమాలపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పుష్పయాగ మహోత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు. ఆలయంలో జూన్ 7 నుంచి 15 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. బ్రహ్మోత్సవాల్లో, నిత్య కైంకర్యాల్లో అర్చక పరిచారికులు, అధికారులు, భక్తుల వల్ల తెలిసీతెలియక లోపాలు జరిగి ఉంటే ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలో ఉదయం ఉభయ దేవేరులతో ప్రసన్న వేంకటేశ్వరుడికి ఉత్సవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ పుష్పయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తులసి, చామంతి, గన్నేరు, మొగిలి, సంపంగి, రోజా, కలువలు వంటి 11 రకాల పుష్పాలు ఐదు రకాల పత్రాలతో స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించారు. భక్తుల విరాళాలతో పాటు టీటీడీ ఆధ్వర్యంలో పుష్పాలతో పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మహామంగళ హారతులిచ్చారు. అనంతరం పద్మావతీ ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర, నీరాజనాలు సమర్పించారు. డిప్యూటి ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ ఆలయ అధికారి వేణుగోపాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట,జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టీకండ్రిగకు చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. శనివారం వైసీపీ నాయకులు అల్లం రాజేష్, చంద్రశేఖర్, రామయ్య, పత్రి.శివయ్య తమ అనుచరులతో తిరుపతి లోని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నివాసానికి చేరుకున్నారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దాముయాదవ్, సర్పంచ్ వెంకటేష్, ప్రభాకర్‌రాజు, రమేష్ యాదవ్, శివరాజు, పొన్నయి రాజు, సుబ్రమణ్యం రాజు, చంద్ర, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు

పుత్తూరు అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో నిధులు మంజూరయ్యాయి. లే అవుట్ రెగ్యులరైజేషన్(ఎల్‌ఆర్‌ఎస్), బిల్డింగ్ పీనలైజేషన్(బీపీఎస్) పథకం కింద ప్రభుత్వానికి చెల్లించిన నిధుల్లో రూ.2 కోట్లు పుత్తూరు మున్సిపాలిటీకి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిధులు కూడా స్థానిక మున్సిపల్ ఖాతాలో జమ అయ్యాయి. అంతేకాకుండా 15 ఆర్థిక ప్రణాళిక సంఘం నుంచి రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. అన్ని వార్డుల్లో కాలువలు, సిమెంటు రోడ్లు, విద్యుత్ దీపాలు, బోర్లు తదితరాల అభివృద్ధి పనులకు ఆ నిధులను వినియోగించనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈక్రమంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచారు. కాలువలను శుభ్రపరుస్తున్నా రు. అంతర్గత వీధులను చెత్త రహితంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నెలలో నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశంలో పలు అభివృద్ధి పనులను ఆమోదించనున్నారు.

అంబేడ్కర్ ముని మనవడికి సన్మానం



యశంత్ అంబేడ్కర్‌ను సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు

పుత్తూరు టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ మునిమనవడు యశంత్ అంబేడ్కర్‌ను పుత్తూరు మండలంలోని దళిత సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం తమిళనాడు రాష్ట్రం తిరుత్తణిలో నిర్వహిస్తున్న బహుజన ర్యాలీకి వెళ్తుతున్న యశ్వంత్ అంబేడ్కర్‌ను పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘ నాయకులు సన్మానించారు. ముందుగా యశ్వంత్ అంబేడ్కర్ బీ.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితుల సమస్యల కోసం పోరాడాలని, ఎస్టీ,ఎస్సీ, బీసీ నాయకులందరు ఒక్కత్రాటిపై ఉండాలని యశ్వంత్ పిలుపునిచ్చారు. సుబ్రమణ్యం, అపరంజి, కుప్పయ్య, మహేష్, వేణు, అంకయ్య, గ్యాస్ ఏజన్సీ రవి తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ భార్య మృతికి నివాళులు

పుత్తూరు అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలకుప్పం మాజీ సర్పంచ్ గాలి రామచంద్రనాయుడు సతీమణి సుబ్బరత్నమ్మ మృతదేహానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, చిత్తూరు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు ఆమె మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆమె కుమారుడు పార్టీ సీనియర్ నాయకులు సతీష్‌నాయుడు, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పుత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు బాలాజీ, ఈశ్వర్‌ప్రసాద్, రవినాయుడు, గిరి, మగేష్ తదితర నేతలు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం భూమి చదును

సత్యవేడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తమారికుప్పం గిరిజన కాలనీ వాసులు ఇంటి స్థలాల కోసం సమీపంలోని ప్రభుత్వ ఖాళీ భూములను చదును చేసుకుంటున్నారు. కొత్తమా రికుప్పం గిరిజన కాలనీలో సుమారు 50 కుటుంబాలు పైగా నివసిస్తున్నాయి. ప్రస్తుతం కుటుంబాలు పెరుగుతుండడంతో ఇంటి స్థలాల సమస్య ఏర్పడింది. వీరు పలుమార్లు స్థలాల కోసం అధికారు లకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నారు. అయినా ఎవరూ స్పందించక పోవడంతో క్రొమారికుప్పం రెవెన్యూ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో శనివారం ప్రవేశించి ఇంటి స్థలాల కోసం భూమిని చదును చేసుకుంటున్నారు. అధికార యంత్రాంగం స్పందించి తాము చదును చేసుకుంటున్న స్థలాలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

కోట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు శనివారం తెలిపారు. మధురైకు చెందిన అరవింద కంటి ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి తిరుపతిలోని అరవింద కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని చెప్పారు.

నేటి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

గూడూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఈనెల 12వ తేదీ అర్థరాత్రి నుంచి సమ్మెలోకి వెళుతామని మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు.



పిచ్చిమొక్కల మధ్య గృహనిర్మాణశాఖ, విద్యాశాఖ కార్యాలయాలు - తడకండ్రిగ సచివాలయం దారిలో అడ్డంగా పడి ఉన్న చెట్టు

చిట్టడవిలా ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం

తడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తడలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం చిట్టడవిని తలపిస్తోంది. తహసీల్దారు, ఎంపీడీవో, విద్యాశాఖ, గృహనిర్మాణం, వ్యవసాయం, తడ కండ్రిగ సచివాలయం-2, వెలుగు కార్యాలయం, పీహెచ్‌సీ తదితర కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ముఖ్యంగా వ్యవసాయ, విద్య, గృహనిర్మాణశాఖ, పీహెచ్‌సీ ఉన్న చోట దట్టమైన గుబురు చెట్లు పెరిగిపోవడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. తహసీల్దారు కార్యాలయం నుంచి తడ కండ్రిగ సచివాలయం-2కు వెళ్లే దారిలో గత తుఫాన్ సమయంలో విరిగిపడిపోయిన చెట్లు రాకపోకలకు అడ్డంగా ఉన్నా వాటిని తొలగించలేదు. గ్రామాలు అందంగా ఉండాలని, ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించే అధికారులు తమ కార్యాలయ పరిసరాలపై దృష్టి సారించక పోవడం శోచనీయం.

అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా: కురుగొండ్ల



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): తాను అవినీతికి పాల్పడుతున్నట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సవాల్ విసిరారు. పట్టణ పరిధిలోని 24వ వార్డు పెరుమాళ్ళస్వామి గుడి వీధిలో నిర్వహించిన సుపరినపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయో లేదోని ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. వార్డుల్లోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కురుగొండ్ల మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి చేసిన విమర్శలకు ఘాటుగా స్పందించారు. చుట్టపుచూపుగా వచ్చి టైం పాస్ రాజకీయాలు చేసే రాంకుమార్ రెడ్డికి ఏం తెలుసని ప్రశ్నించారు. ఆయన చేసిన ఆరోపణలు నిరూపించాలని, లేని పక్షంలో చవకబారు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. వైసీపీ హయాంలో జరిగిన అవినీతిని చూసిన ప్రజలు ఆ పార్టీకి 11 సీట్లుతో సరిపెట్టారని చెప్పారు. అవినీతికి పాల్పడిన వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రస్తుతం జైలు ఊచలు లెక్కపెడుతున్నారని, త్వరలో జగన్ కూడా జైలుకు వెళ్లడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరాందాస్ గంగాధరం, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, బీరం రాజేశ్వరరావు, జానపాటి బాలకృష్ణ, మేరిగ రామకృష్ణ, మంకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన: పాశం



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని నెర్నూరు, కొమ్మనేటూరు పంచాయతీల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక ప్రజలను రెచ్చగొడుతూ వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ధృడసంకల్పంతో ముందుకు వెళుతున్నామన్నారు. అభివృద్ధి కాంక్షించే ప్రజలందరూ ప్రభుత్వానికి తోడుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, నాగేశ్వరరావు, దుద్దా రాఘవరెడ్డి, శీనయ్య, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అత్తివరంలో పోలీసు బందోబస్తు

ఓజిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం అత్తివరంలో శనివారం ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇటీవల గ్రామానికి టీడీపీ నేత ఎల్లు గురుమూర్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అందులో హత్య కోణం బయటపడిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులు పరారీలో ఉన్నారు. వీరికి బంధువైన పాల్చూరు పుల్లయ్య భార్య జయమ్మ(80) శనివారం మృతి చెందింది. దీంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు గురుమూర్తి హత్య కేసులో నిందితులు అత్తివరం గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో ఘర్షణలు చోటుచేసుకునే అవకాశం ఉంటుందని భావించిన పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. గురుమూర్తి వర్గంతో సీఐ, ఎస్ఐ చర్చలు జరిపి ఎలాంటి ఉద్రిక్తత చోటుచేసుకోకుండా అంతయక్రియలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపారు. ఆలయ ఆవరణలో మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను ఊరేగించారు.

సత్యసాయిబాబా గ్రామోత్సవం



వెంకటగిరి టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): పుటపర్తి సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రాజా కుటుంబీకులు వీబీ సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞ యాచేంద్ర ఆధ్వర్యంలో శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం కాశీవిశ్వనాధ స్వామి ఆలయం నుంచి సాయిబాబా చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

ఎస్సీ వసతి గృహంలో ఎంపీడీవో తనిఖీలు



వంటలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో మనోహర్ గౌడ్

చిట్టమూరు, జులై 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిట్టమూరులోని ఎస్సీ వసతి గృహాలను శనివారం ఎంపీడీవో మనోహర్ గౌడ్ తనిఖీ చేశారు. విద్యార్థులకు వండి పెండుతున్న ఆహార పదార్థాలను రుచి చూశారు. విద్యార్థులు నిద్రించే గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. ఆయనతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్, ఏఎస్‌డబ్ల్యూవో మనోజ్ కుమార్, వార్డెన్ మహేంద్ర ఉన్నారు.

అన్నదానం

సూళ్లూరుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటకు చెందిన లయన్స్ క్లబ్, షార్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సెంటర్‌లో అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ సభ్యుడు పీఆర్‌సీ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆర్-5 రీజియన్ కార్యదర్శి ఆదిశేషారెడ్డి, అధ్యక్షురాలు లలిత, కార్యదర్శి అరుణకుమారి, కోశాధికారి జానకి పాల్గొన్నారు.

టీడీపీ నేతకు ఎమ్మెల్యే నివాళి



ప్రభాకర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాశం

కోట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌కు చెందిన టీడీపీ నాయకులు పెల్లూరు ప్రభాకర్‌రెడ్డి శనివారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ నివాళులర్పించారు. ప్రభాకర్‌రెడ్డి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, పెన్నకచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాళెం సర్పంచు కోకర్ల మధుయాదవ్ తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

సూళ్లూరుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్‌వీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 80 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 29 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారికి చెన్నై శంకర నేత్రాలయలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని ఫౌండేషన్ ఛైర్మన్ విజయలక్ష్మి తెలిపారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, జూలై 5(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10.30గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు.

యూబీఐ అటెండర్ ఇంట్లో చోరీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కాపురముంటూ యూనియన్ బ్యాంక్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న ఒక మహిళ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఇంట్లో వున్న దాదాపు రూ.లక్ష విలువ చేసే బంగారు నగలు అపహరించుకుని వెళ్లారు. బాధిత మహిళ నిర్మల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి కథనం మేరకు స్థానిక భవానీనగర్‌లో కాపురమున్న నిర్మల ఎస్వీయూలోని యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నారు. తమ ఇల్లు చిన్నదిగా ఉండటంతో భర్త నాగయ్య, నిర్మల పక్కింటిలోకి వెళ్లి పడుకున్నారు. దొంగలు తాళాలు పగులకొట్టి రూ.లక్ష విలువ చేసే బంగారు నగలు అపహరించుకుని వెళ్లారు.

224 అంగన్‌వాడీ కేంద్రాలకు

ముగ్గురే సూపర్ వైజర్లు

కోట, జూలై 12(ఆంధ్రజ్యోతి): కోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో పనిచేసేందుకు అంగన్‌వాడీ సూపర్ వైజర్లు ఆసక్తి చూపడంలేదు. ఇటీవల చిట్టమూరు మండలంలోని ముగ్గురు సూపర్ వైజర్లలో గూడూరు ప్రాజెక్టుకు ఒకరు, సూళ్లూరుపేట ప్రాజెక్టుకు ఇద్దరు బదిలీ అయ్యారు. ఆ స్థానాల్లో పనిచేయడానికి ఇతర మండలాల్లోని అంగన్‌వాడీ సూపర్ వైజర్లు ఆసక్తి చూపలేదు. దీంతో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు పనిసర్దుబాటు పేరిట కోట మండలంలో ఉన్న ముగ్గురు సూపర్ వైజర్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 224 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో 18 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటన్నింటినీ ముగ్గురు సూపర్ వైజర్లే పర్యవేక్షించాల్సి వస్తోంది. ఆయా మండలాలకు తిరుగుతూ పని చేయాల్సి వస్తుండడంతో సూపర్ వైజర్లపై పనిభారం పెరుగుతోంది. ఈ విషయమై సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ కోట ఐసీడీఎస్ పరిధిలో సూపర్ వైజర్ల కొరత గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలోనే ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు.

పగలు భగభగ... రాత్రి ఉక్కపోత

వేసవిని తలపిస్తున్న ఎండలు



నిర్మానుష్యంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు సెంటర్

సూళ్లూరుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జూలై మాసంలోనూ వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి. వేసవిలో చిరు జల్లులతో చల్లబడిన వాతావరణం జూలైలో ఒక్కసారిగా వేడెక్కింది. సూళ్లూరుపేటలో శనివారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వాస్తవానికి మే నెలలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. అయితే ఈ ఏడాది ముందుగానే తొలకరి వానలు పలకరించాయి. తరచూ తేలికపాటి జల్లులు పడడంతో ఎండల బాధలు తప్పి చల్లటి వాతావరణం కొనసాగుతుందని అందరూ భావించారు. అయితే అనూహ్యంగా జూలైనా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నెల ఆరంభం నుంచే భానుడు భగభగమంటున్నాడు. ఉదయం 9 గంటల నుంచే ఎవరూ బటయకువెళ్లలేని పరిస్థితి. మధ్యాహ్నం అయ్యే సరికి పట్టణంలో ప్రధాన రోడ్లు, వ్యాపార కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలకు తోడు వేడిగాలులు వీస్తున్నాయి.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

గూడూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీన పట్టణంలో జరగనున్న కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జనార్దనరెడ్డి పాల్గొంటారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తొలి అడుగు కార్యక్రమలో పాల్గొనేందుకు మంత్రి జనార్దనరెడ్డి గూడూరుకు వస్తున్నారని తెలిపారు. తమ ప్రాంతాల్లో రోడ్ల సమస్యలను తెలియజేస్తే మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, వాటంబేడు శివకుమార్, బిల్లు చెంచురామయ్య, ఇశ్రాయికుమార్, లీలావతి, జలీల్, నరసింహులు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ విస్తరణకు భూములిచ్చిన రైతులకు నష్ట పరిహారం అందించండి

నాయుడుపేట, జులై 12(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం అందిచాలని నాయుడుపేటకు చెందిన బీజేపీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి విజయ భాస్కర్, జిల్లా మాజీ కార్యదర్శి ఆశ చెంచు కృష్ణయ్య వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్మవరంలో శనివారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామంలో సర్వే నెంబర్ 7-1, 6-1ఎ, 4-2, 6-బి, 6-1బి లో భూములను హైవే విస్తరణలో రైతులు కోల్పోయారన్నారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిహారం అందలేదన్నారు. కలెక్టర్, జాతీయ రహదారుల సంస్థ అధికారులతో మాట్లాడి రైతులకు పరిహారం అందేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు నేతలు చెప్పారు.

వేకువజామున ఇంట్లో చోరీ

30 సవర్ల బంగారు ఆభరణాల అపహరణ

గూడూరు అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గమళ్లపాళెం ప్రాంతంలో ఓ ఇంట్లో శనివారం వేకువజామున చోరీ జరిగింది. ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు తెలిపిన మేరకు వివరాలు... గమళ్లపాళెం ప్రాంతంలో నివాసముంటున్న శివయ్య నిమ్మ కాయల వ్యాపారం చేస్తుంటాడు. ఆగస్టులో తన కుమార్తె వివాహం ఉండడంతో 30 సవర్ల బంగారు ఆభరణాలను ఇంట్లో భద్రపరిచాడు. శనివారం వేకువజామున 3గంటల సమయంలో శివయ్య కుటుంబ సభ్యులు పనుల నిమిత్తం నెల్లూరుకు వెళ్లారు. అతని కుమారుడు చైతన్య ఇంట్లోనే నిద్రిస్తున్నాడు. అదే సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగలగొట్టి అందులో ఉన్న 30 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకు వెళ్లారు. ఉదయం నిద్రలేచిన చైతన్య చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ గీతాకుమారి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, గమళ్లపాళెం సమీపంలోని అశోక్‌నగర్‌లో కూడా ఓ ఇంట్లో చోరీ జరిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

సూళ్లూరుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామిలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో టీడీపీ మేనిఫెస్టోను గుర్తుచేశారు. ఈ సందర్భంగా కిలివేటి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చ కుండానే రూ.2 లక్షల కోట్లకు పైన అప్పులు చేశా రని విమర్శించారు. కార్యక్ర మంలో ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ ముత్తు సెందిల్ కుమార్ పాల్గొన్నారు.

రాయుడు మృతిపై రాజకీయాలు తగదు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్

శ్రీకాళహస్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాయుడు మృతిని రాజకీయాలకు ఆపాదించడం తగదని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో శనివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసిన వినుత వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాసులు అలియాస్ రాయుడు హత్యకు గురి కావడం బాధాకరమన్నారు. దీనిపై వినుతతో పాటు ఆమె భర్త చంద్రబాబు మరో ముగ్గురిని తమిళనాడు పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఇది పూర్తిగా వ్యక్తిగత విబేధాల కారణంగా శ్రీనివాసులు మృతి చెందాడన్నారు. దీన్ని ఏ రాజకీయ పార్టీకి ఆపాదించడం సరికాదన్నారు. ప్రతిపక్ష వైసీపీ శవ రాజకీయాలతోనే సాగుతోందన్నారు. శ్రీనివాసులు కుటుంబానికి తన ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు. శ్రీనివాసులు అంత్యక్రియలకు తాను హాజరై కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరుడికి శనివారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారిని నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవం



శ్రీకాళహస్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో శనివారం సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవం జరిగింది. సత్యసాయి చిత్రపటాన్ని రథంలో ఉంచి పట్టణంలో ఊరేగించారు. ఊరేగింపు ముందు చిన్నారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్మశాన భూ సమస్యపై విచారణ


ఇరువర్గాలతో చర్చిస్తున్న డీఎస్పీ, తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 12 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వెస్ట్ వరత్తూరులోని శ్మశాన భూ సమస్యపై శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, తహసీల్దార్ శ్రీదేవి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఇరు వర్గాల వారితో విచారణ చేపట్టారు. సర్వే నెం.313-1, 313-2లో 4 సెంట్ల భూమిని వెంకట్రామిరెడ్డి శ్మశానానికి విరాళంగా ఇచ్చారు. గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి ఆ భూమి తమదంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు లక్ష్మీరెడ్డి, రవిరెడ్డి, మునిచంద్రారెడ్డి, వీరరాఘవరెడ్డి, శ్రీనివాసులురెడ్డిని స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు. తహసీల్దార్ మాట్లాడుతూ... భూమిని పలు దఫాలుగా సర్వే చేయించామని రికార్డులో వెంకట్రామిరెడ్డి పేరుతో ఉందన్నారు. శ్మశాన భూమి పేరుతో శాంతి భద్రతకు సమస్య సృష్టించవద్దని తెలిపారు. సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



కేవీబీపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి సీసీ కెమెరాలు, కంప్యూటర్లను వితరణ చేశారు. ఈనెల 10న పాఠశాలలో జరిగిన మెగా పీటీఎంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైన విషయం తెలిసిందే. ఈక్రమంలో ప్రిన్సిపాల్ సుకన్య వినతి మేరకు సీసీ కెమెరాలు, కంప్యూటర్లు అందిస్తానని శంకర్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు శనివారం వాటిని అందించగా కెమెరాలను ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నూతన కార్యవర్గం

పిచ్చాటూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నికైనట్లు ఆ సంఘం గౌరవాధ్యక్షుడు ప్రసాదరావు తెలిపారు. అధ్యక్షురాలిగా రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా ఇంద్రాణి, కోశాధికారిగా సుభాషిణి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా అంతకు ముందు అంగన్‌వాడీ ప్రాజెక్టు మహాసభ పిచ్చాటూరులో జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సంఘం గౌరవాధ్యక్షుడు ప్రసాదరావు మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు వాటిని పట్టించుకోలేదన్నారు. నేడు హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. ఏపీ వ్యకాసా జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు గ్రామాల్లో రాజకీయ ఒత్తిడిలను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎంజేపీబీ బాలుర గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ (మిగిలి పోయిన) సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. సీట్ల భర్తీకి ఈనెల 20న పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు జిరాక్స్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో జతచేసి ఈ నెల 19వ తేదీ లోగా పాఠశాలలో అందించాలని కోరారు. వివరాలకు ఫోన్ నెం.9912182725, 7989369199లలో సంప్రదించవచ్చు.

డాక్టర్ పీర్‌కుమార్‌కు ఎన్టీఆర్ జాతీయ అవార్డు


ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్న డాక్టర్ బద్రి పీర్‌కుమార్

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 12(ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ బద్రి పీర్‌కుమార్‌కు ఎన్టీఆర్ జాతీయ అవార్డు దక్కింది. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ ఎన్టీరామారావు, భారతరత్న పీవీ.నరసింహారావు జయంతి ఉత్సవాలు-2025 శని వారం శ్రీత్యాగరాయ గానసభ, కళా వెంకట దీక్షితులు కళావేదిక, చిక్కడపల్లి, హైదరా బాద్‌లో జరిగాయి. తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌజన్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి ప్రతిభావంతులకు ఎన్టీఆర్, పీవీ నరసింహారావు జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. డాక్టర్ బద్రి పీర్‌కుమార్‌ను ఎన్టీఆర్ జాతీయ అవార్డుతో గుర్రం జాషువా వారసురాలు అమృతహుడి రేవతి, ఝాన్సీలక్ష్మీబాయి వారసురాలు ఎస్.శాంతా బాయి, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ, తదితరులు ఘనంగా సత్కరించారు. ఈయన 26 ఏళ్లుగా అధ్యాపకుడిగా, నటుడిగా, రచయితగా, ప్రతిభ కనపరుస్తూ విద్య, సినిమా, టీవీ, నాటక కళా రంగానికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా, కళాకారుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తించి అవార్డు అందజేశామని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ అవార్డు రావడంతో తన బాధ్యత మరింత పెరిగిందని విద్య, కళారంగానికి తనవంతు సేవలు అందిస్తుంటానని పీర్‌కుమార్ తెలిపారు.

కల్యాణ వెంకన్న ఊంజలసేవ

నారాయణవనం, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వెంకన్న ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న ఊంజలసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ సహా నిత్య కైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం దేవరులతో కల్యాణ వెంకన్న ఊంజల సేవను నిర్వహించారు.

బస్ షెల్టర్‌లేక అడవిలో విద్యార్థుల అవస్థలు


బస్సుకోసం రోడ్డుపైనే నిరీక్షిస్తున్న విద్యార్థులు

సత్యవేడు, జూలై 12: మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన జడేరి క్రాస్ వద్ద బస్ షెల్టర్ లేక పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పరిశ్రమలకు వెళ్లే కార్మికులు అవస్థలు పడుతున్నారు. సత్యవేడు - నాగలాపురం వయా టీపీకోట మార్గంలో స్వామిపాదాలు అటవీ ప్రాంతంలోని జడేరి క్రాస్ వద్ద ఇటు సత్యవేడు, అటు కన్నవరం, బీరకుప్పం హైస్కూళ్లకు, కళాశాలలకు జడేరి, అల్లప్పగుంటకు చెందిన విద్యార్థులు ప్రతినిత్యం వెళుతుంటారు. వీరు గ్రామం నుంచి జడేరి క్రాస్‌కు చేరుకుని అక్కడ బస్సెక్కి పాఠశాలలకు వెళ్లాలి. జడేరి క్రాస్ దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో బస్సు వచ్చే వరకు విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి. మరోవైపు ఎంత ఎండైనా, వానైనా చెట్టు నీడనో, కొమ్మకిందనో లేపోతే అలా రోడ్డుపై నిలబడి నిరీక్షిసుంటారు. అధికారులు స్పందించి జడేరి క్రాస్ వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

బురదజల్లడం ఆ పార్టీ నైజం

వైసీపీపై ఎమ్మెల్యే సుధీర్ ధ్వజం



ఎస్ఎన్‌పురం, రామగిరిల్లో కరపత్రాల పంపిణీలో ఎమ్మెల్యేలు సుధీర్, ఆదిమూలం

రేణిగుంట, జూలై 12(ఆంధ్రజ్యోతి): అవకాశం దొరికితే కూటమి ప్రభుత్వంపై నిందలు మోపేందుకు వైసీపీ సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శనివారం సాయంత్రం తూకి వాకం పంచాయతీ పరిధిలోని ఎస్ఎన్‌పురం 6, 7 వార్డుల్లో టీడీపీ నాయకుడు భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పనికట్టుకుని కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతోందన్నారు. ఇటీవల పలమనేరులో మామిడి రైతుల విషయంలో రాద్ధాంతం చేసిందన్నారు. ఇప్పుడు జనసేన ఇన్‌చార్జి కోట వినుత మాజీ డ్రైవర్ రాయుడు మృతి ఉదంతంలో జనసేన, టీడీపీ మధ్య చిచ్చు పెట్టడానికి శవ రాజకీయాలు చేస్తోందన్నారు. మహబూబ్ బాషా, నాదముని రెడ్డి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని ఎంపేడు, అంజనేయపురం పంచాయతీ పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ అంకయ్య చౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, రంగినేని చెరంచయ్యనాయుడు, చెలికం పాపిరెడ్డి, సుబ్బారెడ్డి, ఈశ్వరరెడ్డి, గురవారెడ్డి, రవీంద్రనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● శ్రీకాళహస్తి పట్టణంలోని 19వ వార్డు రాజీవ్‌నగర్‌లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. గోపీనాథ్, సురేష్, తులసమ్మ, అమరావతి, దాక్షాయని, పద్మ, వాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాలెం (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని యానాదివెట్టులో పర్యటించారు. వరదయ్యపాళెంలో డ్రైనేజీ వ్యవస్థ కోసం రూ.40లక్షల తుడా నిధులు మంజూరయ్యాయని చెప్పారు. బీజేపీ మండల అధ్యక్షుడు దిలీప్, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి తడ శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు చిరంజీవి, మురళీనాయుడు, ప్రమీలమ్మ, మునిరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, నాయకులు గురవారెడ్డి, పేరం ధనంజయులు నాయుడు, పొన్నారావు, మోహన్‌నాయుడు, కృష్ణవేణి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రతి ఒక్కరికి వివరిద్దామని ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని రామగిరి శివాలయ సమీపంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించడం కోసం రూ.3కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అనంతరం రామగిరి, అడవికండ్రిగ అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళం గోవన్ రెడ్డి, పద్దురాజు, రవిరెడ్డి, సుమాం జలి, రామచంద్ర రాజు, రాజేంద్ర, రాజేశ్వరి, వాసిరెడ్డి, డిల్లీ, బుజ్జినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఆదిమూలం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని కార్యాలయ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన సీమంతం, అన్నప్రాసనలో పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు ప్రేమ సెల్వకుమార్, మాజీ ఎంపీపీ మురళి, మాజీ వైస్‌ఎంపీపీ అన్బు నాయకులు బాలాజి, శేషాద్రి, యమున తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



మంత్రి కొల్లు రవీంద్రకు, మాజీ మంత్రి యనమలకు స్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో, ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర ఎక్సైజ్, మైన్స్, జియాలజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, తుని ఎమ్మెల్యే యనమల దివ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఎమ్మెల్యే సుధీర్, ఈవో బాపిరెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించారు. స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్యకర్తలకు ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తానని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి చెప్పారు. బీఎన్‌కండ్రిగ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయమ మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దగ్గరకు చేర్చాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, మాజీ ఎంపీపీ బట్టా రమేష్‌యాదవ్, నాయకులు రామంజులునాయుడు, ఎన్‌ఆర్‌ఐ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల వసతిగృహంలో బాల్య వివాహాలపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో విద్యార్థునులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మురళీధర్ రెడ్డి బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ప్రోత్సహించిన, జరిపిన జైలు శిక్ష తప్పదన్నారు. అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరిపించాలన్నారు. అనంతరం హాస్టల్‌లోని పరిసరాలను, వంట గదిని, భోజనాలను తనిఖీ చేశారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, హాస్టల్ వార్డన్ సుభాషిణి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూ ఆక్రమణ అడ్డగింత



రేణిగుంట జూలై 12:(ఆంధ్రజ్యోతి): విలువైన ప్రభుత్వ భూమిని రియల్టర్లు ఆక్రమించేందుకు యత్నించగా తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నారు. గాజులమండ్యం లెక్క దాఖల్ సర్వే నెం.1129లో ఉన్న 5.14 ఎకరాల ప్రభుత్వ మేత భూమిని కొంతమంది రియల్టర్లు ఆక్రమించి ఫెన్సింగ్ వేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఫెన్సింగ్‌ను తొలగించారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి


భాస్కర్ మృతదేహం

రేణిగుంట జూలై 12(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ద్విచక్ర వాహన దారుడు మృతి చెందాడు. ఈ ఘటన గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం జరిగింది. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు భాస్కర్(34) తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళ్తుండగా మర్రిగుంట కూడలి వద్ద శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు ఢీకొనింది. ఈ ఘటనలో భాస్కర్ అక్కడే మృతి చెందాడు. కారు, డ్రైవర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఘనంగా మలాలా దినోత్సవం

శ్రీకాళహస్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లమిట్ట గిరిజన కాలనీలో శనివారం మలాలా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో... పాకిస్థాన్‌లో వెనుకబడిన ప్రాంతంలో మలాలా పుట్టినప్పటికీ చిన్న వయసులో బాలికల చదువు కోసం ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. బాలికలకు విద్య అవసరం లేదని, పాఠశాలల్లో చదవకూడదని తాలిబాన్లు దాడి చేసిన సమయంలో చదువు అవసరం గురించి ఆమె ఎలుగెత్తి చెప్పిందన్నారు. ఐకరాజ్య సమితి ఆమె పోరాటానికి మలాలా పుట్టినరోజున మలాలా దినోత్సవంగా ప్రకటించిందన్నారు.

అవిలేలి వెంకటరామారెడ్డికి ఎమ్మెల్యే నివాళులు

రేణిగుంట, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులమండ్యం గ్రామానికి చెందిన ప్రముఖ తెలుగు విద్వాన్ అవిలేలి వెంకటరామారెడ్డి మృతికి ఎమ్మెల్యే సుధీర్ సంతాపం తెలిపారు. శనివారం గాజులమండ్యానికి చేరుకుని వెంకటరామారెడ్డి కుమారుడు, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ అవిలేలి రాజశేఖర్ రెడ్డిని పరామర్శించారు. అనంతరం వెంకటరామా రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. అంతకుముందుగా శ్రీకాళహస్తి, తిరుపతి మాజీ ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్ రెడ్డి, చదలవాడ కృష్ణమూర్తి, మోహన్, ఉమ్మడి జిల్లాలోని తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం తెలియజేశారు.

వైస్ ఎంపీపీ సరోజిని మృతి


సరోజిని (ఫైల్ ఫొటో)

సత్యవేడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండల వైస్ ఎంపీపీ సరోజిని (70) మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతన్న సరోజిని శనివారం ఉదయం మదనంబేడులోని ఆమె స్వగృహంలో మృతి చెందారు. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సరోజిని మదనంబేడు నుంచి వైసీపీ సానుభూతిపరురాలిగా ఎంపీటీసీ సభ్యురాలిగా గెలుపొంది వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఆమెకు కుమారుడు ఉన్నారు. కాగా సరోజిని మృతిపట్ల మండలంలోని వైసీపీ నాయకులు సంతాపం తెలిపారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు


బోర్డు ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచనపుత్తూరులో ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. సర్వే నెం.21-1లో 9.11 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికావడంతో శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీదేవి మాట్లాడుతూ... భూ ఆక్రమణపై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారన్నారు. ఆయన కలెక్టర్ ఆదేశాల మేరకు బోర్డు ఏర్పాటు చేశామని, ఆక్రమణకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వోలు కూడా పాల్గొన్నారు.